

దొడ్ల- మల్యాల గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్నవాగు



ఇంటికన్నె సమీపంలో ట్రాక్ కొట్టుకుపోయి వేలాడుతున్న రైలు పట్టాలు

జల ప్రళయం

ఉమ్మడి వరంగల్ జిల్లాను ముంచెత్తిన వర్షం

- అతలాకుతలమైన జనజీవనం
- పొంగిపొర్లిన వాగులు, నీట మునిగిన పొలాలు
- పలు చోట్ల ప్రాణ, ఆస్తినష్టం
- వివిధ ప్రాంతాల్లో ఆరుగురి మృతి
- తాళ్లపూసలపల్లి వద్ద దెబ్బతిన్న రైల్వే ట్రాక్
- రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం
- నెక్కొండ మండలంలో వరదలో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు
- లారీ సహాయంతో సురక్షితంగా ఒడ్డుకు..
- నీటమునిగిన వరంగల్ నగరం
- పునరావాసకేంద్రాలకు వరద బాధితులు

హనుమకొండ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో వర్షాలు బీభత్సం సృష్టించాయి. శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలవల్ల ప్రాణ, నష్టం, ఆస్థి నష్టం సంభవించింది. పలుచోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. సాధారణ జనజీవనం స్తంభించిపోయింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరుగురు మృతి చెందారు. మృతుల్లో తండ్రీ కూతుళ్లున్నారు. ఒక యువకుడు వాగులో కొట్టుకుపోతుంటే రెవెన్యూ సిబ్బంది కాపాడారు. ఇళ్లు కూలి ఇద్దరు గాయపడ్డారు. మహబూబాబాద్ జిల్లాలో భారీవర్షాల వల్ల నలుగురు మృత్యువాత పడ్డారు. తాడ్వాయి మండలం కాల్వపల్లి వద్ద వెంగమాంబ చెరువు మత్తడి వరదలో మునిగి జెరిపోతుల మల్లికార్జున్ (35) మృతి చెందాడు. వరద ఉధృతికి రైల్వే ట్రాక్‌లు కొట్టుకుపోయి పలు రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. ములుగు జిల్లా ఏటూరునాగారం-వరంగల్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఉమ్మడి జిల్లాలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కల్వర్టులు, రహదారులపై వరద నీరు పెద్ద ఎత్తున ప్రవహిస్తోంది. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని జిల్లాలోని కలెక్టరేట్‌లలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా సరాసరి 29.67 సె.మీ, హనుమకొండ జిల్లాలో 6.95 సె.మీ, వరంగల్ జిల్లాలో 15.10 సె.మీ, ములుగు జిల్లాలో 11.3 సె.మీ, జనగామ జిల్లాలో 5.7 సె.మీ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 2.7 సె.మీ వర్షపాతం రికార్డయింది.

▸ ములుగు జిల్లాతాడ్వాయి మండలం కాల్వపల్లి వద్ద వెంగమాంబ చెరువు మత్తడి వరదలో మునిగి జెరిపోతుల మల్లికార్జున్(35) మృతిచెందాడు. తాడ్వాయి-పస్రా మధ్యలో మొండెలతోగు, జలగలంచ వద్ద వరద నీరు 163 జాతీయ రహదారిపై ఉధృతంగా ప్రవహించడంతో శనివారం సాయంత్రం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. ఏటూరునాగారం మండలంలో జంపన్నవాగు ఒడ్డున ఉన్న బూటారం గ్రామానికి ముంపు ప్రమాదం ఉండటంతో అధికారులు 230మందిని పునరావాస కేంద్రానికి తరలించారు. జంపన్నవాగు, దయ్యాలవాగు, గోదావరి ముంపు ప్రమాదమున్న గ్రామాల ప్రజలకోసం పునరావాస కేంద్రాలను తెరవాలని, ప్రజలను వెంటనే తరలించాలని ఆదేశించారు. ములుగు జిల్లా ములుగు మండలంలోని సర్వాపురం-



మహబూబాబాద్-అనంతారం రోడ్డులో ట్రాక్ పక్కన నిలిచిన నీరు

జగ్గన్నగూడెం గ్రామాల మధ్య బొగ్గులవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో జగ్గన్నగూడెం, సర్వాపురం గ్రామాలు రాకపోకలు నిలిచి పోయాయి. ఏటూరునాగారం మండలంలో పిడుగుపాటుకు పలు ఇళ్లలోని రిఫ్రిజిరేటర్లు, టీవీలు, ఫ్యాన్లు కాలిపోయాయి. దొడ్ల-ఎలిశెట్టిపల్లి సమీపంలో జంపన్న వాగు, మంగపేట మండలంలో మంగపేట-బోరునర్సాపురం గ్రామాల మధ్య గౌరారం వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ వరద నీరు బోరున ర్సాపురంను ముంచెత్తే ప్రమాదం ఉండడంతో ఆ ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. తాడ్వాయి మం డలంలో మేడారం జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. గోవింద రావుపేట మండలంలోని లక్నవరం సరస్సు మళ్ళీ



రఘునాథపల్లిలో జాతీయ రహదారిపై నిలిచిన వర్షపు నీటితో నిలిచిపోయిన వాహనాలు

▸ మిగతా 7వ పేజీలో..

రైళ్ల రాకపోకలు బంద్



- భారీ వర్షాలతో రైల్వే ట్రాక్ ధ్వంసం
- ఎక్కడివి అక్కడే నిలిచిపోయిన రైళ్లు
- కొన్ని రైళ్లు దారి మళ్లింపు..

విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి..



- అంతరాయం ఉన్న చోట ప్రత్యామ్నాయ పద్ధతిలో సరఫరా చేయాలి
- వీడియోకాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

12 గంటలూ.. వరదలోనే..

- వరంగల్ జిల్లా నెక్కొండలో వరదలో చిక్కుకున్న బస్సు
- బిక్కుబిక్కుమంటూ గడిపిన 46మంది ప్రయాణికులు
- లారీ సాయంతో ఒడ్డుకు.. పర్యవేక్షించిన కలెక్టర్, సీపీ, ఎమ్మెల్యే



లారీలో ప్రయాణికులను ఒడ్డుకు చేర్చుతున్న దృశ్యం..

వరదకు బలైన తండ్రీ కూతుళ్లు

- విమానాశ్రయానికి కారులో బయలుదేరగా ప్రమాదం
- మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం ఆకేరువాగులో ప్రమాదం



మోతీలాల్, అశ్విని(ఫైల్)

వివరాలు : 7లో..



మత్తడి పోస్తున్న ఆత్మకూరు మండలంలోని కటాక్షపూర్ చెరువు



మత్తడి పోస్తున్న ఖానాపూరం మండలంలోని పాకాల చెరువు

నేటి ప్రజావాణి రద్దు

వరంగల్ కలెక్టరేట్/వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 1: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని భారీ వర్షాల నేపథ్యంలో రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సత్యశారద ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తుండటంతో జిల్లా యంత్రాంగం సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నందున ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బల్దియా గ్రీవెన్స్ ప్రజావాణి...

నగర ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ప్రతీ సోమవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేస్తున్నట్టు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రెండు రోజులుగా నగరంలో విస్తారంగా వర్షాలు కురవడంతో అధికారులు ప్రజల సేవలో ఉండి అందుబాటులో ఉండడంతో పాలనాపరమైన కారణాలతో రద్దు చేస్తున్న తెలిపారు. ప్రజలు గమనించి ఫిర్యాదులు సమర్పించేందుకు కార్యాలయానికి రావద్దని కమిషనర్ కోరారు.

అనారోగ్యంతో లండన్‌లో నాచినపల్లి వాసి మృతి

మృతదేహాన్ని త్వరగా తెప్పించాలని తల్లిదండ్రుల వేడుకోలు



ప్రణయ్ (ఫైల్)

దుగ్గొండి, సెప్టెంబరు 1: దుగ్గొండి మండలం నాచినపల్లి గ్రామానికి చెందిన దేవులపల్లి ప్రణయ్ (25) ఉన్నత చదువుల కోసం లండన్ వెళ్లి అనారోగానికి గురై భారత కాలమానం ప్రకారం ఆదివారం తెలవారుజామున 3.25గంటలకు అక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లిదండ్రులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. నాచినపల్లికి చెందిన దేవులపల్లి రమేశ్, రజిలతకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు ప్రణయ్(25). కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ప్రణయ్ స్థానికంగా డిగ్రీ పూర్తి చేసి ఉన్నత చదవుల కోసం గత ఏడాది లండన్‌కు వెళ్లా డు. అక్కడే బీపీపీ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ చదువుతున్నాడు. 20రోజుల క్రితం ప్రణయ్ అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో అతడి స్నేహితులు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందినట్టు ప్రణయ్ స్నేహితులు తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. కుమారుడి మరణవార్త విని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతదేహాన్ని త్వరగా స్వగ్రామానికి తెప్పించేలా ప్రభుత్వం చొరవ చూపాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

ఆకట్టుకున్న ఫలహారం బండి



ఖిలావరంగల్, సెప్టెంబరు 1: హైదరాబాద్ తరహాలో ఖిలావరంగల్ 38వ, డివిజన్‌లో గౌరైపోతులతో ఫలహారం బండి ఆకట్టుకుంది. రథంపై అమ్మవారి ఫొటో, పోతరాజుల నృత్యాలు.. డీజే చప్పుళ్లతో ఆదివారం పోచమ్మబోనాలు ఘనంగా జరిగాయి. శ్రావణమాసం చివరి ఆదివారం కావడంతో పడమర కోటలోని ముదిరాజ్‌లుపెద్దఎత్తున బోనాలతో ఊగేగింపుగా తరలివెళ్లారు. ఖిలావరంగల్ చెమన్ వద్ద పోతరాజులు వినూత్న ప్రదర్శనలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

జిల్లాలో కుండపోత

- 151.0మి.మీ వర్షపాతం
- పొంగిపొర్లుతున్న వాగులు, చెరువులు
- పలు గ్రామాలకు రాకపోకలు బంద్
- పంట పొలాల్లోకి వరదనీరు
- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- సురక్షిత ప్రాంతాలకు బాధితుల తరలింపు



మత్తడిపోస్తున్న సంగెం చెరువు

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 1: ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లు జిల్లాలో కుండపోత వర్షం కురిసింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉద యం వరకు కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తం భించింది. పర్వతగిరి, నెక్కొండ మండలాల్లో అతిభారీ వర్షం పడింది. భారీ వర్షంతో చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. జిల్లాలో 151.0మిమీ వర్షపాతం నమోదైంది. వరంగల్ నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కలెక్టర్ సత్యశారద, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరదనీ టి ప్రవాహం తగ్గితే పంట పొల్లాలోని నీటిని తొలగించుకునేందుకు అవకాశం ఉంటుం దని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లేదంటే పంటలు పాడైపో తాయని రైతులు అంటున్నారు.

మత్తడి పోస్తున్న పాకాల

మూడు రోజులుగా వర్షాలు దంచికొట్టడంతో పాకాల సరస్సులోకి ఎగువ ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున వరద నీరు రావడంతో సరస్సు ఆదివారం మత్తడి ఉధృతితో పరవళ్లు తొక్కుతుంది. పాకాల సరస్సు పూర్తి సామర్థ్యం 30.3 అడుగులు కాగా, ప్రస్తుతం సరస్సులోకి 32.3 అడుగుల నీరు చేరడంతో రెండు అండుగుల మేర మత్తడితో పరవళ్లు తొక్కుతుంది. పాకాల సరస్సు రెండు అడుగుల మేర మత్తడిపోయడంతో అశోక్‌నగర్ శివారులోని లోలెవల్ కల్వర్ట్ బ్రిడ్జిపై నుంచి పాకాల వాగు ప్రవహించడంతో నర్సంపేట నుంచి పాకాల మీదుగా మహబూబాబాద్ జిల్లా కొత్తగూడకు వెళ్లేందుకు రాకపోకలు నిలిచిపోయాయి. కాగా, పాకాల సరస్సు మత్తడి ఉధృతి పెరగడంతో మత్తడి వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్‌లు ముందుస్తు భద్రత చర్యలు చేపట్టారు.



జలమయమైన వరంగల్ సీకేఎం ఆస్పత్రి రోడ్డు

నగరం జలమయం

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. 14వ డివిజన్‌లోని ఎస్ఆర్‌నగర్‌లో నడుం వరకు నీళ్లు వచ్చాయి. సాయిగణేస్ కాలనీ, మధురానగర్ కాలనీల్లో ఇళ్లలోకి వరనీరు చేరింది. మధురానగర్‌లో ఓ గర్భిణీనీ డీఆర్‌ఎఫ్ బృందం సురక్షిత ప్రాంతానికి తరలించారు. కాశిబుగ్గ ప్రధానరోడ్లపైకి వరదనీరు నిలవడంతో ప్రయాణి కుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిపడ్డారు. 32,33,39 డివిజన్ల పరిధిలోని ఇళ్లలోకి నీళ్లు రావడంతో అధికారులు, ప్రజాప్రతినిదులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అండర్ బ్రిడ్జి వద్ద నడుముల లోతు నీరురావడంతో ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరంగల్‌లోని నగరంలోని భద్రకాళీ చెరువు, కోట చెరువు, చిన్నవడ్డెపల్లి చెరువు, బొందివాగు పొంగిపొర్లుతోంది. బొందివాగు పొంగిపొర్లడంతో హంటర్‌రోడ్‌లో రోడ్లపైకి వరదనీరు చేరి రాకపోకలకు ఇబ్బంది కలిగింది.

సహాయక చర్యలు..

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కలెక్టర్‌తోపాటు ప్రజా ప్రతినిధులు సహాయక చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాలను కలెక్టర్ సత్య శారద, మున్సిపల్ కమిషన్ వాకడే, సీపీ అంబర్‌కిషోర్ ఝా, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ పర్యటించారు. వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కేఆర్‌నాగరాజు, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు క్షేత్రస్థాయిలో పర్య టించి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

మండలాల వారీగా వర్షపాతం	
పర్వతగిరి	294.8మిమీ
నెక్కొండ	246.4మి.మీ
చెన్నారావుపేట	196.2మి.మీ
రాయపర్తి	196.2మి.మీ
వర్ధన్నపేట	185.5మి.మీ
వరంగల్	120.6మి.మీ
దుగ్గొండి	106.4మి.మీ
నర్సంపేట	114.4మి.మీ
ఖానాపురం	112.4మి.మీ
నల్లబెల్లి	82.6మి.మీ
సంగెం	112.4మి.మీ
గీసుగొండ	105.4మి.మీ
ఖిలావరంగల్	94.6మి.మీ

సోషల్ వెల్ఫేర్ మహిళా గురుకులంలోకి వరద

- విద్యార్థినులను భూపాలపల్లికి తరలింపు
- ఎలాంటి ఇబ్బందులు కలుగవద్దు: కలెక్టర్



గురుకులాన్ని సందర్శించిన కలెక్టర్

శంభునిపేట, సెప్టెంబరు 1: విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని కలెక్టర్ సత్య శారద సిబ్బందిని ఆదేశించారు. ఎడతెరపి కురుస్తున్న వర్షాలకు 42వ డివిజన్‌లోని వరంగల్ తూర్పు తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ గురుకుల కళాశాల భవనంలోని సెల్లార్‌లోకి వరద నీరుచేరింది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కలెక్టర్‌కు ఆదివారం సమాచారం అందింది. వెంటనే కలెక్టర్, ఎంపీ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్ గుండు చందనపూర్ణచందర్‌లు అధికారులతో కలిసి కళాశాలను సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురుకులంలోని మొత్తం 350 మంది విద్యార్థులను భూపాలపల్లిలోని సోషల్ వెల్ఫేర్ మహిళాడిగ్రీ కళాశాలకు ఆర్టీసీ బస్సుల్లో తరలించారు. కలెక్టర్ వెంట మునిసిపల్, రెవెన్యూ, పోలీసు, ఫైర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు1: ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా జిల్లాలో జలమయం అయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలను ఖాళీ చేయించి సమీపంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించడం జరుగుతుందని కలెక్టర్ సత్య శారద తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తక్షణ సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబరు 1800 425 3434, మొబైల్ నెంబర్ 91542 52936లలో సంప్రదించాలని సూచించారు. జీడబ్ల్యూఎంసీ టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 1980, 97019 99645, 97019 99676 మొబైల్ నెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

విద్యా సంస్థలకు నేడు సెలవు

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు1: ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా జిల్లాలో జలమయం అయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలను ఖాళీ చేయించి సమీపంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించడం జరుగుతుందని కలెక్టర్ సత్య శారద తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తక్షణ సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబరు 1800 425 3434, మొబైల్ నెంబర్ 91542 52936లలో సంప్రదించాలని సూచించారు. జీడబ్ల్యూఎంసీ టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 1980, 97019 99645, 97019 99676 మొబైల్ నెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కాళోజీ అవార్డు కమిటీ చైర్మన్‌గా అందెశ్రీ

ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 1 : యేటా సెప్టెంబరు 9న ప్రకటించే కాళోజీ స్మారక అవార్డు కోసం ఎంపిక కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రజా గాయకుడు అందెశ్రీ చైర్మన్‌గా కమిటీని నియామకం చేసింది. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు కన్వీనర్‌గా ప్రభుత్వ అధికారి, కవి ఏనుగు నర్సింహారెడ్డి, సంగిశెట్టి నర్సయ్య, కాళోజీ ఫౌండేషన్ పక్షాన పొట్లపల్లి శ్రీనివాసరావు సభ్యులుగా కమిటీని నియామకం చేసింది. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీ ఈసారి వరంగల్‌లో ప్రదానం చేయనున్న కాళోజీ స్మారక అవార్డుకు అర్హులైన వ్యక్తులను ఎంపిక చేయనున్నారు.

ఈనెల 21 నుంచి
ఎలక్ట్రిసిటీ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్స్

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 1 : టీజీ ట్రాన్స్‌కో అండ్ డిస్కమ్‌ల ఇంటర్ సర్కిల్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్స్ ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు కరీంనగర్ సర్కిల్ ఆఫీస్‌లో నిర్వహిస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ ఉమ్మడి వరంగల్ స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్, హనుమకొండ ఎస్ఈ కె.వెంకటరమణ తెలిపారు. టోర్నమెంట్స్‌లో పాల్గొనాలనుకునే ఉమ్మడి వరంగల్‌లోని ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 5న హనుమకొండ జేఎన్ఎస్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించే సెలెక్షన్స్ హాజరు కావాలన్నారు.

బ్రీత్ ఎనలైజర్‌ను నిషేధించాలని ఆర్టీసీ డ్రైవర్ల ఆందోళన

వరంగల్-2 డిపోలో అధికారులతో ఘర్షణ



వరంగల్-2 డిపో ఎదుట ఆందోళన చేస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు

బాలసముద్రం, సెప్టెంబరు 1 : వరంగల్-2 డిపోలో పనిచేయని బ్రీత్ ఎనలైజర్‌లను నిషేధించాలని ఆదివారం ఆర్టీసీ డ్రైవర్లు కండక్టర్‌లు ఆందోళన చేశారు. సెక్యూరిటీ అధికారులు డ్రైవర్లను బ్రీత్ ఎనలైజర్‌తో చెకింగ్ చేస్తూ ఉన్నతాధికారులకు తప్పుడు రిపోర్టులు ఇచ్చి డ్రైవర్లపై చర్యలు తీసుకుంటున్నారని మండిపడ్డారు. ఈ మేరకు డిపో గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. కాగా, ఆర్టీసీ డ్రైవర్ ఎస్.నరేందర్ వరంగల్-2 డిపోలో రాజధాని బస్సు సర్వీసు వరంగల్ నుంచి హైదరాబాద్‌కు నడుపుతున్నాడు. ఆదివారం సెక్యూరిటీ సిబ్బంది నరేందర్‌కు బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా 26 వచ్చిందన్నారు. మద్యం అలవాటు కూడా లేని తనకు 26 రావడంపై నరేందర్ స్థానిక డిపో ఎంప్లాయిస్ యూనియన్ సెక్రటరీ వై.శ్రీనివాస్, డిపో ప్రెసిడెంట్ రమేష్, మురళి ప్రచారకార్యదర్శికి సమాచారం అందించాడు. అక్కడికి చేరుకుని సెక్యూరిటీ అధికారులతో డ్రైవర్లు ఘర్షణకు దిగారు. హనుమకొండ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అక్కడ టెస్టు చేసుకొమ్మని చెప్పడంతో డ్రైవర్ నరేందర్‌ను బ్రీత్ ఎనలైజర్‌తో పోలీసులు చెక్ చేస్తే 0 వచ్చినట్లు తెలిపారు.

అలాగే శనివారం ఎండి.యాకూబ్ అనే డ్రైవర్ హనుమకొండ నుంచి మంగపేట ఎక్స్‌ప్రెస్ బస్సుడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సెక్యూరిటీ సిబ్బంది పరీక్షించగా 130 వచ్చినట్లు తెలిపారు. యాకూబ్‌కు మద్యం సేవించే అలవాటు లేదని డిపో సెక్యూరిటీ అధికారులను డ్రైవర్లు నిలదీశారు. డిపోలో గతంలో ముగ్గురిని అకారణంగా సస్పెండ్ చేసినట్లు తెలిపారు. సెక్యూరిటీ సిబ్బంది తప్పిదం వల్ల టెస్టు చేసిన రిపోర్టును అధికారులకు పంపించి తరువాత డ్రైవర్లను సస్పెండ్, రిమూవ్ చేస్తున్నారు. దీంతో డ్రైవర్లు రోడ్డున పడాల్సిన పరిస్థితి వస్తోందని ఆందోళన చేశారు. డిపోలో డ్రైవర్ల కొరతతో అదనపు డ్యూటీలు చేస్తూ నిద్ర లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలిపారు.

విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి

- అంతరాయం ఉన్నచోట ప్రత్యామ్నాయ పద్ధతిలో సరఫరా చేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం, ఇన్‌సెట్‌లో ఎన్పీడీసీఎల్ సీఎండీ, ఎస్ఈ

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 1 : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ అంతరాయాలు ఉన్న చోట ఆయా జిల్లాల ఉన్నతాధికారుల సహాయం తీసుకొని వెంటనే విద్యుత్‌ను పునరుద్ధరించాలని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క సూచించారు. తెలంగాణ వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్న సందర్భంగా ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డితోపాటు 16 జిల్లాల ఎస్‌ఈలు, 40 మంది డీఈలతో భట్టి విక్రమార్క ఆదివారం ఖమ్మం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముందుగా ఆయా జిల్లాల్లో పరిస్థితి ఎలా ఉందని ఎస్‌ఈలు, డీఈలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ.. విపత్తులో ముందుగా నష్టపోయేది విద్యుత్ శాఖ కాబట్టి.. విద్యుత్ సిబ్బంది 24 గంటల పాటు అందుబాటులో ఉండి నష్టాలను ముందస్తుగానే అంచనా వేసి విద్యుత్ లేని చోట పునరుద్ధరించేందుకు కృషి చేయాలన్నారు. వరదల వల్ల నీటమునిగిన సబ్‌స్టేషన్లు, పిడుగులు పడి దెబ్బతిన్న చోట యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలన్నారు. మరమ్మతులు పూర్తయ్యేవరకు సమీపంలోని సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్‌ను సరఫరా చేయాలన్నారు. కంట్రోల్ రూమ్ నుంచి వచ్చే ఆదేశాలను క్షేత్ర స్థాయిలో ఉండే అధికారులు ఎప్పటికప్పుడు అమలు చేయాలన్నారు. విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్స్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయాలు ఉన్నచోట యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించేందుకు ఎస్‌ఈలతో నిరంతరం సమీక్షలు జరపాలని సీఎండీ వరుణ్‌రెడ్డిని ఆదేశించారు. విద్యుత్ అంతరాయానికి సంబంధించిన సమస్యలుంటే వాటి పరిష్కారానికి విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన 1912, 18004250028 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చన్నారు. సామాజిక బాధ్యతలను విస్మరించి విధుల పట్ల నిర్లక్ష్యం వహించే విద్యుత్ అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్ధరాత్రిని సైతం లెక్కచేయకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు నిరంతరం శ్రమిస్తున్న విద్యుత్ సిబ్బందిని డిప్యూటీ సీఎం అభినందించారు.

శభాష్ నగేష్!

- కావడి కట్టి వృద్ధురాలికి రక్షణ
- 100 మందిని పునరావాసానికి తరలించిన సీరోలు ఎస్సై


వృద్ధురాలిని జోలెలో తరలిస్తున్న ఎస్సై నగేష్

సీరోలు, సెప్టెంబరు 1: మహబూబాబాద్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. దీంతో ఆదివారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సేవలందించారు. మరిపెడ మండలం సీతారాంతండా నీట మునగడంతో అక్కడి గిరిజనులు ఎటూ కదలలేని స్థితిలో తల్లడిల్లుతున్నారు. ఈ క్రమంలో పోలీసులు భరోసాగా నిలిచి 100 మంది తండావాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అదే తండాలో నడవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలిని రక్షించేందుకు పోలీసులు కావడి కట్టి, ఆమెను అందులో కూర్చోబెట్టి సురక్షిత ప్రాంతానికి చేర్చారు. సీరోలు ఎస్సై నగేష్ స్వయానా కావడి మోసి 60ఏళ్ల వృద్ధురాలిని సురక్షిత ప్రాంతానికి తరలించడంతో తండావాసులతో పాటు అటు పోలీసు వర్గాలు, జిల్లా ప్రజలు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

రైళ్ల రాకపోకలు బంద్

- భారీ వర్షాలతో రైల్వే ట్రాక్ ధ్వంసం
- ఎక్కడికక్కడే నిలిచిపోయిన రైళ్లు
- బోసిపోయిన వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్లు


వరంగల్ రైల్వేస్టేషన్‌లో పట్టాలపై వర్షపు నీటిని తొలగిస్తున్న సిబ్బంది

గిర్మాజీపేట, సెప్టెంబరు 1: విజయవాడ - వరంగల్ రైల్వే మార్గంలోని ఇంటికన్నె - కేసముద్రం రైల్వేస్టేషన్ల మధ్య ఎగువ, దిగువ రైల్వేట్రాక్‌లు ధ్వంసం, మహబూబాబాద్ - తాళ్లపూసపల్లి రైల్వే ట్రాక్‌పై వరద నీరు కారణంగా రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. విజయవాడ- వరంగల్-సికింద్రాబాద్, విజయవాడ-వరంగల్ - న్యూఢిల్లీ మార్గాల్లో రైళ్ల రాకపోకలు శనివారం రాత్రి నుంచి పూర్తిగా స్తంభించిపోయాయి. ఈ మార్గంలో నడుస్తున్న రైళ్లను ఆయా స్టేషన్లలో నిలిపివేశారు. శనివారం రాత్రి నుంచి మొదలైన భారీ వర్షం ఆదివారం మధ్యాహ్నం వరకు కొనసాగింది. భారీ వర్షంతో రైల్వేస్టేషన్, రైల్వే ట్రాక్‌లపై నీరు నిలిచిపోగా సిబ్బంది తొలగించారు.

కాగా, సికింద్రాబాద్ నుంచి మచిలీపట్నం బయలుదేరిన మచిలీపట్నం - బీదర్ ఎక్స్‌ప్రెస్ శనివారం అర్ధరాత్రి 12.30 గంటలకు వరంగల్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. అర్ధరాత్రి నుంచి వరంగల్‌లో నిలిచిపోయిన ఈ రైలును ఆదివారం ఉదయం 7.30 గంటలకు తిరిగి సికింద్రాబాద్‌కు పంపించారు. అలాగే శనివారం అర్ధరాత్రి నుంచి ఎలుగూరు రైల్వేస్టేషన్‌లో నిలిచిపోయిన పాటలీపుత్ర - యశ్వంత్‌పూర్ రైలును ఆదివారం ఉదయం 9.30 గంటలకు తిరిగి సికింద్రాబాద్‌కు పంపించారు. శనివారం రాత్రి నుంచి చింతల్‌పల్లి రైల్వేస్టేషన్‌లో నిలిచిపోయిన సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలును ఆదివారం ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్‌కు పంపించారు. చింతల్‌పల్లి, ఎలుగూరు, వరంగల్ రైల్వేస్టేషన్లలో నిలిచిపోయిన పాటలీపుత్ర - యశ్వంత్‌పూర్, సంబల్‌పూర్, మచిలీపట్నం - బీదర్ ఎక్స్‌ప్రెస్‌ల ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా వరంగల్ రైల్వేస్టేషన్ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. రైల్వే రక్షిత బృందం(ఆర్‌పీఎఫ్) ప్రయాణికులకు భద్రత ఏర్పాట్లు చేసింది. వరంగల్ రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ బి.రాజ్‌గోపాల్, చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రాజేంద్ర ఆధ్వర్యంలో కమర్షియల్ సిబ్బంది ప్రయాణికులకు తగిన సహకారం అందించారు.

పలు రైళ్ల రద్దు

వరంగల్ మీదుగా సికింద్రాబాద్, - విజయవాడ మధ్య ప్రయాణించాల్సిన అన్ని రైళ్లను రద్దు చేశారు. గోల్కొండ, కృష్ణ, ఇంటర్‌సిటీ, శాతవాహన, గోదావరి, చార్మినార్ రైళ్లను రద్దు చేశారు. ఆదివారం వరంగల్ మీదుగా వెళ్లాల్సిన పద్మావతి, సింహపురి ఎక్స్‌ప్రెస్ రైళ్లను వరంగల్‌కు రాకుండా సికింద్రాబాద్ నుంచి కాచిగూడ మీదుగా దారి మళ్లించారు. అలాగే న్యూఢిల్లీ నుంచి వరంగల్ మీదుగా విజయవాడ వైపు వెళ్లాల్సిన రైళ్లను వరంగల్ రాకుండా కాజీపేట మీదుగా సికింద్రాబాద్‌కు తరలించారు. రైళ్ల రద్దు, దారి మళ్లింపు కారణంగా వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్లలో శనివారం రాత్రి నుంచి హెల్ప్‌లైన్‌లు పనిచేస్తున్నాయి. రైళ్ల రద్దు, దారి మళ్లింపు సమాచారాన్ని హెల్ప్‌డెస్క్ సిబ్బంది ప్రయాణికులకు చెబుతున్నారు. రైళ్ల రద్దుతో వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్లు ఆదివారం వెలవెలబోయాయి. ఇదిలా ఉండగా, ఆదివారం మధ్యాహ్నం సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ మేనేజర్ భరతేష్‌కుమార్ జైన్ సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలులో వచ్చారు. వరద నీరు కారణంగా ధ్వంసమైన ఇంటికన్నె - నెక్కొండ రైల్వే ట్రాక్ మరమ్మతు పనులను పర్యవేక్షించారు.

రైళ్ల దారి మళ్లింపు

- వర్ష ప్రభావంతో అధికారుల చర్యలు
- ఇప్పగూడ వద్ద ట్రాక్‌పైకి చేరిన వరద నీరు


ఇప్పగూడ రైల్వే ట్రాక్‌పై చేరిన వరద నీరు


రైళ్ల రద్దుతో కాజీపేటలో బోసిపోయిన ప్లాట్‌ఫారం

కాజీపేట, సెప్టెంబరు 1: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కేసముద్రం - ఇంటికన్నె వద్ద వరద ఉధృతికి రైల్వే ట్రాక్ దెబ్బతినడంతో కాజీపేట మీదుగా విజయవాడ వైపు వెళ్లే రైళ్లను రద్దు చేశారు. సికింద్రాబాద్ నుంచి విజయవాడ వైపువెళ్లే పలు రైళ్లను నల్లగొండ మీదుగా రూట్‌మార్చి పంపారు. సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వైపు వెళ్లే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు. న్యూఢిల్లీ నుంచి వరంగల్ మీదుగా వెళ్లే పలు రైళ్లను దారిమళ్లించి కాజీపేట మీదుగా సికింద్రాబాద్‌కు తరలించారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే కాజీపేట రైల్వేస్టేషన్ ప్రయాణికులు లేకపోవడంతో బోసిపోయింది. ప్రయాణికులకు రైళ్ల వివరాలు తెలిపేందుకు రైల్వే అధికారులు హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశారు. రైళ్ల రద్దు వివరాలు తెలియకుండా రైల్వే స్టేషన్‌కు వచ్చిన ప్రయాణికులు ఆర్టీసీ బస్సులను ఆశ్రయించారు.

కాగా, స్టేషన్ ఘన్‌పూర్ సమీపంలోని ఇప్పగూడ వద్ద రైల్వే ట్రాక్‌పై భారీగా నీరు చేరింది. విషయం తెలుసుకున్న రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. హుటాహుటిన ఘటనా స్థలికి వెళ్లి ట్రాక్ మరమ్మతులు చేపట్టారు. ఇదిలా ఉండగా రైల్వే ఎమర్జెన్సీ సేవలందించే బ్రేక్‌డౌన్ సిబ్బందికి లీవ్‌లు రద్దు చేశారు. రైళ్లకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా వెంటనే విధుల్లో చేరాలని ఆదేశాలు జారీ చేశారు. రైళ్ల రాకపోకలు ఇతరత్రా విషయాలను తెలుసుకునేందుకు కాజీపేట రైల్వే స్టేషన్‌లోని హెల్ప్‌లైన్ నంబర్ 0870- 2576430కు ఫోన్ చేయాలని రైల్వే అధికారులు తెలిపారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న బొగత



వాజేడు, సెప్టెంబరు 1: తెలంగాణ నయాగరా బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీరు భారీగా చేరడంతో జలపాతం ఉప్పొంగుతోంది. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అడవుల నుంచి వచ్చే వరద నీటి ప్రవాహానికి ఉగ్రరూపం దాల్చింది. భారీ వర్షాల నేపథ్యంలో జలపాతం సందర్శనను ఫారెస్టు అధికారులు నిలిపివేశారు. ఆదివారం పలువురు పర్యాటకులు రాగా వారిని అనుమతించలేదు. దీంతో నిరాశగా వెనుదిరిగారు.

కేయూ పరిధిలోని నేటి పరీక్షలన్నీ వాయిదా

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 1: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో సెప్టెంబరు 2వ తేదీ సోమవారం రోజున జరగాల్సిన పరీక్షలన్నీ భారీ వర్షాల నేపథ్యంలో వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి ఆదివారం ప్రకటించారు. డిగ్రీ, పీజీతో పాటు ఇతర కోర్సుల థియరీ, ప్రాక్టికల్స్, వైవా, పరీక్షలన్నీ వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. తిరిగి ఆయా పరీక్షలు ఎప్పుడు నిర్వహించేది తర్వాత ప్రకటిస్తామని వెల్లడించారు. కాగా, సెప్టెంబరు 3వ తేదీ నుంచి జరగాల్సిన పరీక్షలన్నీ యథావిధిగా జరుగుతామని స్పష్టం చేశారు.

నేడు వర్సిటీతో పాటు వర్సిటీ కళాశాలలకు సెలవు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 1: కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలతో పాటు వర్సిటీ సుబేదారి పీజీ కళాశాల, మహిళా పీజీ కళాశాల, ఖమ్మం అనుబంధ కళాశాలన్నింటికీ సెప్టెంబరు 2వ తేదీన సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో కేయూ ఇన్‌చార్జ్ వీసీ, ఐఏఎస్ అధికారి వాకాటి కరుణ ఆదేశాల మేరకు సెలవు ప్రకటించినట్లు రిజిస్ట్రార్ మల్లారెడ్డి వెల్లడించారు. సెప్టెంబరు 3 నుంచి యథావిధిగా వర్సిటీ, అనుబంధ కళాశాలన్ని పనిచేస్తాయని వెల్లడించారు.

వరంగల్‌లో బస్సు సర్వీసులు రద్దు

- బస్సుల కోసం ప్రయాణికుల పడిగాపులు

బాలసముద్రం, సెప్టెంబరు 1: వరంగల్ రీజియన్ పరిధిలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో చెరువులు, కుంటలు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో పలు రూట్లలో బస్సు సర్వీసులను ఆర్టీసీ అధికారులు రద్దు చేశారు. హనుమకొండ నుంచి ఏటూరునాగారం వెళ్లే బస్సులను ములుగు జిల్లా పస్రా వరకు కొనసాగించారు. హనుమకొండనుంచి భద్రాచలం వెళ్లే బస్సు సర్వీసులను నర్సంపేట, గూడూరు వరకు కొనసాగించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఖమ్మం, సూర్యాపేట డిపోలకు చెందిన బస్సు సర్వీసులు ఆదివారం మధ్యాహ్నం నుంచి హనుమకొండ బస్టాండ్‌కు రాలేదని, స్టేషన్‌ఘన్‌పూర్, రఘునాథపల్లి వద్ద భారీ వర్షానికి వరంగల్ డిపోకు చెందిన బస్సులు వరదల్లో చిక్కుకున్నట్లు తెలిపారు. బస్సు సర్వీసులు లేకపోవడంతో వివిధ రూట్లలో ప్రయాణించే ప్రయాణికులు ఇబ్బందులు పడినట్లు తెలిపారు.

వరద నీటిలో మునిగి ఒకరి మృతి



మేడారం, సెప్టెంబరు 1: వరదనీటిలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాల్వపల్లి గ్రామానికి చెందిన జేరిపోతుల మల్లికార్జున్(38) పశువులను తోలేందుకు బయటకు వచ్చాడు. గ్రామంలోని ఆశ్రమ పాఠశాల వెనుక ఉన్న తోల్లతోగు వరద నీటి నుంచి దాటుతుండగా గల్లంతయ్యాడు. ఈత రాకపోవడం, ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో నీటిలో కొట్టుకుపోయాడు. దూరం నుంచి గమనించిన స్థానికులు అక్కడికి వెళ్లి వరదలో గాలించగా మల్లికార్జున్ మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం సామాజికఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వరదకు బలైన తండ్రీ కూతుళ్లు

- విమానాశ్రయానికి కారులో బయలుదేరగా ప్రమాదం
- మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం ఆకేరువాగులో ఘటన



గల్లంతైన తండ్రి మోతీలాల్, కూతురు అశ్విని (ఫైల్), అశ్విని మృతదేహం

మహబూబాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం హైలెవల్ బ్రిడ్జిపై ప్రవహిస్తున్న ఆకేరువాగు ఉధృతిలో కారు కొట్టుకుపోయింది. ఇందులో ఖమ్మం జిల్లా సింగరేణి మండలం కారేపల్లి గేట్ తండాకు చెందిన తండ్రి, కూతురు నూనావత్ మోతీలాల్, నూనావత్ అశ్వినిలు గల్లంతయ్యారు. వాగు ఉధృతి తగ్గాక బాల్ని ధర్మారం శివారు పామాయిల్ తోటలో నూనావత్ అశ్విని మృతదేహం లభించింది.

నూనావత్ అశ్విని దేశ స్థాయిలోనే వ్యవసాయ శాస్త్రవేత్తగా ప్రథమస్థానం సాధించి సత్తా చాటారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో ఏజీబీఎస్సీ పూర్తిచేసి ప్రస్తుతం పీహెచ్‌డీ చేస్తోంది. జెనిటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్‌లో శాస్త్రవేత్తగా ఎంపికై ఏజీబీఎస్సీలో బంగారు పతకంతోపాటు మూడు రజిత పతకాలు, విశ్వవిద్యాలయం స్థాయిలో ఆరు బంగారు పతకాలు, ఢిల్లీలో అగ్రికల్చర్ ఎంఎస్సీలో బంగారు పతకం సాధించారు. ప్రస్తుతం ఇక్రిశాట్‌లో మూడోసంవత్సరం పీహెచ్‌డీ పరిశోధకురాలుగా పనిచేస్తున్నారు. రెండ్రోజుల కిందట తన సోదరుడి నిశ్చితార్థానికి వచ్చి బెంగళూరు వెళ్లేందుకు ఆమె తండ్రి డ్రైవింగ్ చేస్తుండగా, ఆదివారం తెల్లవారుజామున హైదరాబాద్ విమానాయత్రయానికి బయలు దేరారు. సుమారు 4.30 గంటల ప్రాంతంలో పురుషోత్తమయగూడెం బ్రిడ్జి పైనుంచి ఆకేరు ప్రవహిస్తుండగా వాగు దాటే ప్రయత్నంలో కారుతో సహా కొట్టుకుపోయారు. తండ్రి మృతదేహం ఇంకా లభించలేదు.

మత్తడి పోస్తున్న పాకాల సరస్సు

ఖానాపురం, సెప్టెంబరు 1: మూడు రోజులుగా వర్షాలు దంచికొట్టడంతో పాకాల సరస్సులోకి ఎగువ ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున వరద నీరు చేరింది. దీంతో సరస్సు ఆదివారం మత్తడి ఉధృతితో పరవళ్లు తొక్కుతోంది. పాకాల సరస్సు పూర్తి సామర్థ్యం 30.3 అడుగులు కాగా, ప్రస్తుతం సరస్సులోకి 32.3 అడుగుల నీరు చేరడంతో రెండు అండుగుల మేర మత్తడితో పరవళ్లు తొక్కుతోంది.

కల్వర్టులో పడి వృద్ధురాలి మృతి


సమ్మక్క మృతదేహం

దుగ్గొండి, సెప్టెంబరు 1: నీటి కల్వర్టులో పడి 75 ఏళ్ల వృద్ధురాలు మృతి చెందింది. ఈ సంఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని గిర్నిబావిలో ఆదివారు చోటు చేసుకొంది. ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మండలంలోని మందపల్లికి చెందిన కొండ్ర సమ్మక్క (75) ప్రతీరోజు గిర్నిబావితో పాటు సమీప గ్రామాల్లో భిక్షాటన చేస్తూ ఉంటుంది. ఆదివారం ఇంటి నుంచి వెళ్లిన సమ్మక్క సాయంత్రం ఇంటికి రాలేదు. కుమారుడు సదయ్య అమ్మకోసం వెతికినప్పటికీ దొరకలేదు. ఆదివారం గిర్నిబావి సమీపంలోని కల్వర్టులో సమ్మక్క మృతదేహం కనిపించగా గ్రామస్థులు చూసి స్థానిక పోలీసులకు తెలిపారు. ఎస్సై వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కల్వర్టు నుంచి బయటకు తీశారు. సమ్మక్కకు సరిగా కళ్లు కనిపించకపోవడంతో రోడ్డు పక్కన ఉన్న నీటి కల్వర్టులో పడగా వర్షం నీటి ప్రవాహంతో కొంతదూరం కొట్టుకొని పోయి మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. కాగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, ఆర్డీవో కృష్ణవేణి, ఎంపీడీవో లెక్కల అరుంధతి చేరుకొని సమ్మక్క మృతికి కారణాలను ఎస్సై ద్వారా తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాధవరెడ్డి సమ్మక్క దహన సంస్కారాలకు రూ.10వేలు ఆర్థిక సాయం చేసి ప్రభుత్వపరంగా సాయం అందే విధంగా చేస్తానని తెలిపారు. మృతి చెందిన సమ్మక్కకు కుమారుడు, కుమార్తెలు ఉన్నారు. మృతిరాలు కుమారుడు కొండ్ర సదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

జల ప్రళయం

(5వ పేజీ తరువాయి)

మత్తడి పోస్తోంది. వెంకటాపురం(నూగూరు) మండలంలో మొర్రవాని గూడెంలో మల్లమ్మకు చెందిన ఇల్లు కూలింది. గోపాల్‌పూర్‌లో ఒక ఇల్లు నేలమట్టమైంది.

- జయశంకర్ భూపాపల్లి జిల్లాలో శనివారం సాయంత్రం నుంచి కురిసిన వర్షాలవల్ల పలు చెరువులు పొంగిపొర్లుతున్నాయి. గణపురం మండలంలో లోలెవల్ కాజ్‌వేలు పొంగి పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కాటారం మండలంలో పత్తి పంట నీట మునిగింది. చిట్యాల, ఘనపురం మండలాల్లో చెరువులు, కుంటలు మత్తళ్లు పోస్తున్నాయి.

- వరంగల్ జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. పర్వతగిరి, నెక్కొండ మండలాల్లో అతిభారీ వర్షం పడింది. మిగతా మండలాల్లోనూ భారీ వర్షం పడడంతో చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. జిల్లాలో 151.0మిమీ వర్షపాతం నమోదైంది. వరంగల్ నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కలెక్టర్ సత్యశారద, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వర్ధన్నపేట తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లోకి నీటి ఉధృతి పెరుగుతుండడంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ఎదురుగా ఉన్న పైపులైన్‌కు తోడు మరో కాలువను తవ్వారు. వర్ధన్నపేట నుంచి కోనాపురం వెళ్లే కల్వర్టు గతంలోనే గండిపడడంతో తాత్కాలిక మరమ్మతులు చేశారు. వర్ధన్నపేట పట్టణ పరిధిలోని కోనారెడ్డి చెరువుకు నీటిని తీసుకువచ్చే కట్టు కాలువ మరమ్మతులకు నోచుకోక పోవడంతో చెరువులోకి నీరువచ్చే మార్గం లేకనే పూర్తిస్థాయిలో నిండడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెన్నారావుపేట మండలం పాపయ్యపేటలో ఊర చెరువుకు బుంగ పడడంతో అప్రమత్తమైన అధికారులు బంగను పూడ్చారు. మండలకేంద్రంలో అతి పెద్ద చెరువైన కోపాకుల చెరువు పూర్తి నీటి మట్టానికి చెరుకొని మత్తడి పోస్తోంది. నర్సంపేట- నెక్కొండ ప్రధాన రహదారిపై ఉన్న లోలెవల్ వంతెనపై వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో నర్సంపేట- చెన్నారావుపేటకు రాకపోకలు నిలిచిపోయాయి. పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామంలో నడిరోడ్డుపై చెట్టుపడిపోవడంతో వాహనాలు నిలిచిపోయాయి. నర్సంపేట మండలంలోని మాదన్నపేట చెరువు, మగ్దుంపురం ఊర చెరువు, మహేశ్వరం, ముత్తోజిపేట గ్రామాల్లోని చెరువులు నిండి మత్తడి పోస్తున్నాయి. మాధన్నపేట వాగు పొంగి పొర్లడంతో వాగు బ్రిడ్జిపై నుంచి వరదనీరు ప్రవహిస్తుండడంతో నర్సంపేట నుంచి మాధన్నపేట వైపు రాకపోకలను అధికారులు నిలిపివేయించారు. గురిజాల లోలెవల్ వంతెనపై వరద పెరగడంతో నర్సంపేట నుంచి గురిజాల, గుంటూరుపల్లి, లింగాపురం తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నల్లబెల్లి మండలంలోని రంగాయ చెరువు మత్తడి పోసింది. దుగ్గొండి మండలంలోని తిమ్మంపేట దామెర చెరువు మత్తడిపోయగా తిమ్మంపేటలోని వరి పంట పొలాలు నీటిలో మనిగిపోయాయి. తిమ్మంపేట, నారాయణతండా రోడ్డు మధ్య గల కాజ్వేపై వరదనీరు ఉధృతంగాప్రవహించగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షానికి జిల్లాలోని చెరువులు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. శనివారం రాత్రి వేములవాడ నుంచి మహబూబాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు రాత్రి పది గంటల సమయంలో నెక్కొండ మండలం వెంకటాపూర్ చెరువు అలుగు పారుతుండడంతో అందులో చిక్కుకుంది. ఆదివారం ఉదయం కలెక్టర్, నర్సంపేట ఎమ్మెల్యే హుటాహుటిన చేరుకుని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. దుగ్గొండి మండలం గిర్నిబావి వద్ద కల్వర్టులో పడి మందపల్లికి చెందిన సమక్క (75) మృతి చెందింది. పాకాల సరస్సు రెండు అడుగుల మేర మత్తడిపోయడంతో అశోక్‌నగర్ శివారులోని లోలెవల్ కల్వర్ట్ బ్రిడ్జిపై నుంచి పాకాల వాగు ప్రవహించడంతో నర్సంపేట నుంచి పాకాల మీదుగా మహబూబాబాద్ జిల్లా కొత్తగూడకు వెళ్లేందుకు రాకపోకలు నిలిచిపోయాయి. కాగా, పాకాల సరస్సు మత్తడి ఉధృతి పెరగడంతో పోలీసులు ముందుస్తు భద్రత చర్యలు చేపట్టారు.

- జనగామ జిల్లాను ఆదివారం జోరువాన ముంచెత్తింది. శనివారం రాత్రి నుంచి మొదలైన వర్షం ఆదివారం సాయంత్రం వరకు ఏకధాటిగా కురిసింది. వర్షం కారణంగా జిల్లాలోన్ని అన్ని మండలాల్లోని చెరువులు, కుంటలన్నీ నిండిపోయాయి. జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో పలు రహదారులు దెబ్బతిన్నాయి. జిల్లాలో చాలాచోట్ల రోడ్లు తెగిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. భారీ వర్షాల కారణంగా చెరువులు మత్తడి పడి వాగులు పారాయి. పాలకుర్తి మండలం నారాయణగూడెం-వావిలాల గ్రామాల మధ్య నల్లిగానికుంట తండాకు వెళ్లే రోడ్డు వర్షానికి కొట్టుకుపోయింది. కొడకండ్ల మండలం రామవరం వద్ద రోడ్డు తెగిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వర్షాల కారణంగా జిల్లాలోని చాలా చోట్ల రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. దేవరుప్పుల మండలం రామచంద్రాపురం గ్రామ శివారు రామసముద్రం చెరువు మత్తడి పడడంతో కోలుకొండ- రామచంద్రాపురం గ్రామాల మధ్య రోడ్లపై రాకపోకలు నిలిచిపోయాయి. దేవరుప్పుల మండలం కడవెండి చెక్‌డ్యామ్ వద్ద వాగు ఉధృతిగా ప్రవహిస్తోంది. జనగామ- హుస్నాబాద్ రోడ్డులో జనగామ మండలం గానుగుపహాడ్ వద్ద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద తాత్కాలికంగా నిర్మించిన రోడ్డు వర్షం కారణంగా కొట్టుకుపోయింది. అదే విధంగా దేవరుప్పుల మండలం కోలుకొండ వద్ద, పెద్దమడూరు చెక్‌డ్యామ్ వద్ద వాగులు దుంకి పారుతున్నాయి. లింగాలఘనపురం మండలం పటేల్‌గూడెం వద్ద నిర్మాణంలో ఉన్న కాజ్‌వే వద్ద తాత్కాలిక రోడ్డు వరద నీటి కారణంగా కొట్టుకుపోయింది. దీంతో జనగామ-పాలకుర్తి రోడ్డులో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు పాలకుర్తికి వెళ్లే వాహనాలను చిన్నమడూరు, అప్పిరెడ్డిపల్లి మీదుగా పాలకుర్తికి మళ్లించారు. జఫర్‌గడ్ మండలం తమ్మడపల్లి(జి), పాలకుర్తికి వెళ్లే దారిలో బీటీరోడ్డు వరద ఉధృతికి కొట్టుకుపోయింది. జనగామ మండలం చీటకోడూరు వద్ద రోడ్డుకు అడ్డంగా చెట్లు కూలిపోవడంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

- మహబూబాబాద్ జిల్లాలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షంతో ఆదివారం జనజీవనం స్తంభించిపోయింది. వాగులు, చెరువులు పొంగిపొర్లడంతో పాటు మత్తళ్లు పోస్తున్నాయి. మానుకోట పట్టణంలో చుట్టూరా చెరువులు నిండి పొంగి ప్రవహించడంతో రోడ్లపైకి నీరురావడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మున్నేరువాగు ఉధృతంగా ప్రవహించి, రోడ్డుపైకి నీరు రావడంతో మహబూబాబాద్- వరంగల్‌కు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. నర్సింహులపేట వద్ద కాడెద్దులు కొట్టుకుపోయాయి. వివిధ గ్రామాల్లో శనివారం రాత్రి 7 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. మహబూబాబాద్ మండలం వీఎస్.లక్ష్మీపురంలో సుమారు రూ.16 లక్షల విలువైన కోళ్లఫాం నేలకూలింది. జిన్నెలవాగు ప్రవహిస్తుండడంతో మహబూబాబాద్-ఇల్లందు మధ్య, దంతాలపల్లిలో పాలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో దంతాలపల్లి-సూర్యాపేట మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కురవి పెద్దచెరువు అలుగుపడి రహదారి కొంతమేర కొట్టుకుపోయింది. ముత్యాలమ్మ చెరువు అలుగుపడి మొగిలిచర్ల రోడ్డు కొంతమేర తెగిపోయింది. నర్సింహులపేట మండలంలో మూడు చెరువులు, ఆరు కుంటలకు గండి పడింది. పత్తి, వరి, ఇతర పంటలల్లో ఇసుకదిబ్బలు పేరుకుపోయాయి. పకీరాతండాలో ఆకేరువాగులో ఒక గేదె, ఆరు కాడెద్దులు వరదలో కొట్టుకుపోగా, అందులో గేదె మృతి చెందింది. నెల్లికుదురు మండలం రాజులకొత్తపల్లి చెరువు తెగిపోవడంతో రావిరాల గ్రామం నీటమునిగింది. చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి ఆకేరు వాగు కుడి కాలువ తెగిపోవడంతో వరిపొలాలు మొత్తం నీటమునిగాయి. ఉగ్గంపల్లికి చెందిన కొంపెల్లికి వెంకన్నకు చెందిన 12 గొర్రెలు వదర ఉధృతికి కొట్టుకుపోయాయి. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలో రాకాసితండా, సీరోలు మండలం దుబ్బతండాలోకి భారీగా వరద నీరు చేరి మునిగిపోతుండడంతో 300 మందిని గ్రామస్థులు తీసుకువచ్చి సీరోలు మండలం చిలుక్కోయలపాడులో ప్రాథమిక పాఠశాలలో ఆశ్రయం కల్పించి భోజన వసతులు ఏర్పాటు చేశారు. డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో ఆగిన పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లో 11 నెలల బాబుకు అస్వస్థతకు గురికావడంతో 108 ద్వారా ఆస్పత్రికి తరలించారు.

- హనుమకొండ జిల్లాను భారీవర్షాలు ముంచెత్తాయి. శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. కుండపోతగా కురిసిన వర్షం వల్ల జిల్లా అతలాకుతలమైంది. వాగులు, చెరువులు, కుంటల్లోకి భారీగా వరదనీరు చేరి ఉప్పొంగుతున్నాయి. రోడ్లపైకి వర్షపు నీరు పెద్ద ఎత్తున ప్రవహిస్తుండడంతో పలు చోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. సాధారణ జనజీవనం స్తంభించి పోయింది. శనివారం ఉదయం నుంచే వర్షం కురవడం మొదలైంది. రాత్రికి మరింత జోరందుకున్నది. తెల్లవారుజాము వరకు కురుస్తూనే ఉన్నది. దీంతో లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. పలు ఇళ్లలోకి వర్షపు నీరు ప్రవేశించింది. ఒకటీ రెండు చోట్ల ఇల్లు కూలాయి. వేలేరుమండలంలో అత్యధికంగా వర్షం పడింది. వర్ష బీభత్సానికి జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షందాటికి కరెంట్ స్తంభాలు వంగిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయాయి. పంట పొలాలు నీట మునిగాయి. జిల్లాలోని దాదాపు అన్ని చెరువులు మత్తళ్లు పోస్తున్నాయి. నగరంలో పలు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి.

12 గంటలూ.. వరదలోనే..

- వరంగల్ జిల్లా నెక్కొండలో వరదలో చిక్కుకున్న బస్సు
- బిక్కుబిక్కుమంటూ గడిపిన 46 మంది ప్రయాణికులు
- లారీ సాయంతో ఒడ్డుకు.. పర్యవేక్షించిన కలెక్టర్, సీపీ, ఎమ్మెల్యే


ప్రయాణికులను రక్షించిన లారీ డ్రైవర్‌ను అభినందిస్తున్న కలెక్టర్ సత్యశారద

నెక్కొండ, సెప్టెంబరు 1: వేములవాడ నుంచి మహబూబాబాద్‌కు బయలుదేరిన ఆర్టీసీ బస్సు వరదలో చిక్కుకోవడంతో 46 మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సుమారు 12గంటలు ఆ వరదలోనే ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని కాలం గడిపారు. ప్రయాణికులు, స్థానికుల వివరాల ప్రకారం... మహబూబాబాద్ డిపోకు చెందిన టీఎస్24 జడ్0018 నెంబరు గల ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడకు వెళ్లింది. అక్కడి నుంచి బయలుదేరిన బస్సులో పలువురు ప్రయాణికులు మహబూబాబాద్‌కు బయలుదేరారు. మధ్యలో హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో ఒకరిద్దరు ప్రయాణికులు సైతం ఎక్కారు. శనివారం రాత్రి సుమారు 10 గంటల ప్రాంతంలో వరంగల్ జిల్లా నెక్కొండ మండలం వెంకటాపురం గ్రామ సమీపంలో బస్సు వరదల్లో చిక్కుకుంది. చిమ్మచీకటితోపాటు భారీ వర్షం, ఉరుములు, మెరుపులకు ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. రాత్రి 10 గంటల నుంచి ఆదివారం ఉదయం 10 గంటల వరకూ బస్సులో భయంభయంగా గడిపారు. విషయం తెలుసుకున్న నెక్కొండ ఎస్సై మహేందర్‌తో పోలీసు సిబ్బంది, వెంకటాపురం గ్రామ ప్రజలు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకోవడానికి ప్రయత్నించారు. బస్సు దగ్గరకు వెళ్ల డానికి వరదలు అడ్డురావడంతో చేసేదిలేక అర కిలోమీటరు దూరం ఉండి ప్రయాణికులకు రాత్రంతా ధైర్యం చెప్పారు. బస్సు ప్రయాణికులను ఒడ్డుకు చేర్చడానికి పోలీసులు అర్ధరాత్రి వరకూ ప్రయత్నం చేసినా వర్షం పెరగడంతో వీలుకాలేదు.

లారీ డ్రైవర్ సాయంతో ఒడ్డుకు..

వరదలో చిక్కుకున్న బస్సులో డ్రైవర్, కండక్టర్‌తోపాటు 25 మంది మహిళలు, 10 మంది పురుషులు, 11 మంది చిన్న పిల్లలు ఉన్నారు. ఆదివారం ఉదయం రైల్వే సిమెంట్ బ్రిక్స్ లోడ్‌తో నెక్కొండలో నిలిచిన సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన లారీ డ్రైవర్ రామును ఎస్సై మహేందర్ బస్సు ప్రయాణికులను రక్షించాలని కోరారు. దీంతో సాహసించిన డ్రైవర్ ఘటనా స్థలానికి చేరుకొని, బస్సు ఉన్న ప్రాంతానికి లారీని చాకచక్యంగా తీసుకువెళ్లి లారీలో ప్రయాణికులను ఎక్కించుకొని ఒడ్డుకు చేర్చారు. ప్రస్తుతం బస్సు ఇంకా వరదలోనే ఉంది. అర కిలోమీటరు దూరంలో బస్సు ఉండడంతో కనీసం ఎవరికీ కనిపించని పరిస్థితి ఉంది.

కలెక్టర్, ఎమ్మెల్యే, సీపీ సహాయక చర్యలు


వరదలో చిక్కుకున్న బస్సులో ప్రయాణికులు

విషయం తెలుసుకున్న కలెక్టర్ సత్యశారద, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, సీపీ అంబర్‌కిషోర్ ఝా ఆదివారం ఉదయం వెంకటాపురం గ్రామం చేరుకున్నారు. వెంటనే అధికారులను అప్రమత్తం చేసి ప్రయాణికులను సురక్షిత ప్రాంతానికి చేర్చారు. ప్రయాణికులకు వెంకటాపురం పాఠశాలలో అల్పాహారం, దుస్తులు అందించారు. అనంతరం నెక్కొండలోని సెయింట్ థెరిసా పాఠశాలలో భోజనం అందించి వారి ఇళ్లకు పంపించారు. ప్రయాణికులను రక్షించిన లారీ డ్రైవర్‌ను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఆర్డీవో కృష్ణవేణి, నెక్కొండ సీఐ చంద్రమోహన్, నర్సంపేట టీపీసీసీ మెంబర్ సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నెక్కొండ, సెప్టెంబరు 1 : మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పనులు ఉంటేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని కలెక్టర్ సత్యశారద, సీపీ అంబర్‌కిషోర్ ఝా. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని వెంకటాపురంలో వరదలో ప్రయాణికుల బస్సు చిక్కుకోవడంతో ప్రయాణికులను రక్షించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న ప్రాంతాలను గుర్తించి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని, వారి ద్వార ప్రజలకు సహాయక చర్యలు అందిస్తున్నామన్నారు.

వరదకారణంగా రహదారులు దెబ్బతినడంతో పలు ప్రాంతాల్లో పోలీసు యంత్రాంగం సహాయంతో రాకపోకలను నిలిపివేయించామన్నారు. చెన్నారావుపేట ఊర చెరువు గండిపడే ప్రమా దం ఉండడంతో మరమ్మతు చేశామన్నారు. వరంగల్‌లోని ఎల్ఎస్ నగర్, బీఆర్ నగర్, నర్సంపేటలోని ఎన్టీఆర్ నగర్‌లు జలమయం కావడంతో సహాయక చర్యలు చేపట్టామన్నారు.



అండర్‌బ్రిడ్జి వద్ద నిలిచిన నీటిని తొలగిస్తున్న సిబ్బంది



జలమయంగా మారిన అండర్‌బ్రిడ్జి ప్రాంతం



డీకే నగర్‌లో ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న కార్పొరేటర్ రవి



వరంగల్ ఆర్టీసి తాత్కాలిక బస్‌స్టేషన్‌లో వరదనీరు

నగరం జలమయం

- నీటమునిగిన లోతట్టు ప్రాంతాలు
- రోడ్లపై నిలిచిన వరద నీరు..
- పొంగిపొర్లిన డ్రైయినేజీలు.. మాన్‌హోల్స్..

మట్టెవాడ, సెప్టెంబరు 1: భారీ వర్షానికి నగరంలో జలమయమైంది. నర్సంపేట రోడ్డు, కాశిబుగ్గ తిలక్‌రోడ్డు, ఓసిటీ రోడ్డు మార్కెట్ రోడ్డు, నిజాంపుర, స్టేషన్ రోడ్డు, దేశాయిపేట రోడ్డు, ఆర్ఎన్‌టీ రోడ్డు, బట్టలబజార్‌రోడ్డు, మేదరివాడ, బీటూ బజార్ రోడ్డు, హంటర్‌రోడ్డు, రామన్నపేట రోడ్డు తదితర ప్రాంతాల్లోని కాలనీ రోడ్లు, ప్రధాన రహదారులు జలమయమాయ్యాయి. బాధితులను వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ ఆధ్వర్యంలో మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్, మిల్స్‌కాలనీ సీఐలు తుమ్మగోపి, మచ్చ శివకుమార్, మల్లయ్యల ఆధ్వర్యంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరంగల్‌లోని సాయినగర్ కాలనీ, సంతోష్ మాతకాలనీ, బృందావన్ కాలనీ, ఎన్టీఆర్‌నగర్ కాలనీ, శాకరాసికుంట, మధురనగర్ కాలనీ, సాయిగణేశ్‌కాలనీ, వివేకానంద కాలనీ, ఎంఎస్‌నగర్, గాంధీనగర్ లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి.

● వరంగల్ కార్పొరేషన్: వరంగల్ ట్రైసిటీస్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తూ వరదలో చిక్కుకుని ఇబ్బంది పడుతున్న ప్రజలను బల్దియా సిబ్బంది పునరావాస కేంద్రాలకు తరలించారు. సుమారు 500 మందిని పునరావాస కేంద్రాలకు తరలించి భోజనం, వసతి కల్పించినట్టు అధికారులు తెలిపారు. వరంగల్‌లో శుభం గార్డెన్, బీరన్నకుంట ప్రభుత్వ పాఠశాల, కాశికుంట చర్చి, రాధాకృష్ణ భవన్, కేపీఎస్ కన్వెన్షన్‌హాల్, హనుమకొండలో ఏజీఆర్ గార్డెన్‌లో బాధితులకు పునరావాసం కల్పించారు. మునిసిపల్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు పునరావాసంలో ఉన్న బాధితులకు ఆహార పొట్లాలు అందించారు. కొందరు మానవతావాధులు నీటి మునిగిన కాలనీలలో ఉన్న ప్రజల వద్దకు వెళ్లి ఆహారాన్ని అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. 25 చోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు బల్దియా అధికారులు తెలిపారు. సాయంత్రం వర్షం కొంత గెరువు ఇవ్వడంతో అటు ప్రజలు, ఇటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

●కరీమాబాద్: బల్దియా 40వ డివిజన్ డీకే నగర్, కొత్త కుమ్మరి వాడ, బీసీ గురుకులం, శ్మశాన వాటికలు నీటమునిగాయి. కార్పొరేటర్ మరుపల్ల రవి పర్యటించారు. మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య డీకే నగర్, జలమయమైన కాలనీల్లో సహాయక చర్యలు చేపట్టారు. 32, 33, 39 డివిజన్ పరిధిలోని లక్ష్మీ నగర్, ఏకశిలానగర్, హనుమాన్ నగర్ ప్రాంతాల్లో పెద్ద కాలువ పొంగడంతో ఇళ్ళలోకి వరద నీరు చేరింది.

●ఖిలావరంగల్: అండర్ రైల్వేగేట్ ప్రాంతం నీటమునిగింది. మధ్యకోటలోని శ్రీస్వయంభూ దేవాలయంలోకి వర్షం నీరు చేరింది. మైసయ్య నగ ర్, ఏసీరెడ్డి నగర్, భూపేష్‌నగర్, శివనగర్, పెరకవాడ, అండర్‌బ్రిడ్జి, 18డివిజన్ లేబర్‌కాలనీ, చెన్నారెడ్డికాలనీ, లెనిన్‌నగర్, శాలినీనగర్ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. అండర్‌బ్రిడ్జిలో వర్షం, డ్రైయినేజీ నీరు



కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయంలో వద్ద చేరిన వరద నీరు

చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. 27వ డివిజన్ కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్ డిజాస్టర్ రెస్పాన్స్, నగరపాలక సిబ్బందితో మోటార్లను పెట్టి నీటిని బయటికి తరలించారు.

● శంభునిపేట : మిల్స్‌కాలనీ పోలీసుస్టేషన్ వద్ద జాతీయ రహదారిపై భారీగా వరద నీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాశీకుంట, పోచమ్మకుంట ప్రాంతాల్లో వరదనీరు ఇళ్లలో చేరింది. లెనిన్‌నగర్, మంగళమ్మ కుంట, గణేష్ నగర్, టీచర్స్ కాలనీ, వినాయక నగర్ కాలనీ, తెలంగాణ కాలనీ, వెంకటేశ్వర కాలనీల్లో రోడ్లన్నీ బురదమయమయ్యాయి. మామునూరులో వరంగల్-ఖమ్మం జాతీయ రహదారి పై వరద నీరు ప్రవహిస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

●గిర్మాజీపేట : నగరంలోని కృష్ణకాలనీ ప్రభుత్వ హైస్కూల్, వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్, అండర్‌బ్రిడ్జి, సీకేఎం ప్రభుత్వ ఆస్పత్రి గల్లీలు వరదనీటితో జలమయయ్యాయి. భారీ వర్షంతో కృష్ణకాలనీ ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కళాశాల చెరువుగా మారింది. కళాశాల ప్రిన్సిపాల్ గది, కార్యాలయ గది, తరగతి గదులు, ల్యాబ్, వరండా పూర్తిగా నీటమునిగింది. అండర్‌బ్రిడ్జి కింద మోకాలి లోతు వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కార్పొరేటర్ అనిల్‌కుమార్, సీఐ శివకుమార్‌లు డీఆర్ఎఫ్ సిబ్బందితో వరదనీరు తొలగించడంతో రాకపోకలు సజావుగా సాగాయి. భారీ వర్షానికి తాత్కాలిక వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్ జలమయమైంది. సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి నుంచి వరంగల్ హెడ్‌పోస్టాఫీసుకు వెళ్లు రోడ్డు వరదతో నిండింది.

● కాశిబుగ్గ: కాశిబుగ్గ, వివేకనందకాలనీ, సాయికాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లు వరద నీటితో మునిగాయి. జనజీవనం పూర్తిగా స్తంభించింది.

● శంభునిపేట: ముంపు ప్రాంతాల ప్రజలను విధాలా ఆదుకుంటామని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ అన్నారు. నగరంలోని 41, 42 డివిజన్‌లలోని ముంపు ప్రాంతాలను మేయర్, అధికారులతో కలిసి కొండా మురళీ పరిశీలించారు. రంగశాయిపేటలోని లెనిన్ నగర్, తెలంగాణ కాలనీలతో పాటు కాశికుంట ప్రాంతాల్లో పర్యటించి బాధితులతో మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు గుండు చందనపూర్ణచందర్, పోశాల పద్మ స్వామి, గోపాల నవీన్‌రాజ్ పాల్గొన్నారు.



వరద నీటితో నిండిన కాశీబుగ్గ కాలనీ



మామునూరులో జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా..

మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు

వరంగల్ సిటీ, సెప్టెంబరు 1: జలమయమైన కాలనీవాసులు అధైర్య పడొద్దని, వారికి అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు అన్నారు. ఆదివారం కొండా మురళీధర్‌రావు ముంపు ప్రాంతాలైన బీఆర్ఎస్‌నగర్, ఎంఎస్‌నగర్, ఎన్టీఆర్‌నగర్, అండర్ బ్రిడ్జి, తెలంగాణ కాలనీలలో పర్యటించారు. కొండా మాట్లాడుతూ.. భారీ వర్షాలు ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బాధితులకు సూచించారు. మరో రెండు రోజులు వర్షాలు ఉన్నాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న కొండా మురళీధర్‌రావు, మేయర్ గుండు సుధారాణి



వర్షం నీటితో నిండిన మాలఅగర్తల చెరువు, బయటికి వెళ్తున్న చెరువు నీరు



కాశీకుంటలో రోడ్డుపై పారుతున్న వరద నీరు



మైసయ్యనగర్‌లో ఖమ్మంరోడ్‌పై నుంచి వెళ్తున్న వరద నీరు



అండర్‌బ్రిడ్జి వద్ద సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్న బోట్



చెరువుగా మారిన కృష్ణకాలనీ ప్రభుత్వ పాఠశాల

కలెక్టరేట్ ఎదుట ఉద్యోగ సంఘాల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగ సంఘాల నేతలు

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 1: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని జాక్ చైర్మన్ గజ్జెల రామ్‌కిషన్ డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా బాలసముద్రంలోని ఏకశిలా పార్కు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. రామ్‌కిషన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. సీపీఎస్ రద్దు చేసే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని, రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా కార్యదర్శి గాజె వేణుగోపాల్, కోశాధికారి పాలకుర్తి సదానందం, సహాధ్యక్షులు హేమనాయక్, జిల్లా బాధ్యులు కందుల జీవన్, వెంకటస్వామి, రవీందర్‌రావు, మురళీధర్‌రెడ్డి, గోవిందరావు, లక్ష్మణ్, శ్రీనివాస్, టి.కుమార్, సుజన్, శ్రీనివాస్, కె.భోగేశ్వర్, మనోజ్, నాగరాజు, సోమయ్య, సాంబయ్య, భానుప్రకాశ్, మల్లేశం, గణేష్, కుమారస్వామి, భరత్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



పోచమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఖిలావరంగల్, సెప్టెంబరు 1: పవిత్ర శ్రావణ మాసం నాల్గవ ఆదివారం అండర్ రైల్వే గేట్‌లోని పలు ప్రాంతాల్లో పోచమ్మ బోనాలు ప్రజలు అత్యంత జరుపుకున్నారు. ఆదివారం ఖిలావరంగల్, మధ్యకోట, తూర్పు కోటలతో పాటు ఏసిరెడ్డినగర్, పాడిమల్లారెడ్డి, మైసయ్యనగర్, పుప్పాలగుట్ట, చింతల్, శివనగర్, పెరకవాడ, అండర్‌బ్రిడ్జి తదితర ప్రాంతాలలో నెత్తిన బోనాలు ఎత్తుకొని డప్పుచప్పుళ్లతో బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో 37వ, డివిజన్ పడమర, తూర్పు కోట పోచమ్మ దేవాలయం కోశాధికారి సిరబోయిన ఎల్లయ్య పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ పృథ్వీరాజ్ తదితరులు

మట్టెవాడ, సెప్టెంబరు 1: రక్తదానం ప్రాణదానంతో సమానమని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (కేసీజీఎఫ్) ఇరుకుళ్ళ రామకృష్ణ అన్నారు. ఆదివారం వాసవి క్లబ్ వారోత్సవాల్లో భాగంగా వాసవి క్లబ్ వరంగల్ డిస్ట్రిక్ట్-2 క్యాబినెట్ సమావేశం జరిగింది. అనంతరం వరంగల్‌లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు, కేయూ పీఆర్‌ఓ అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ తో పాటు మరికొందరూ వాసవి క్లబ్ సభ్యులు రక్తదానాన్ని చేశారు. కార్యక్రమంలో క్లబ్ గవర్నర్ గంపా సాంబమూర్తి, దొడ్డ మోహన్‌రావు, వెమిశెట్టి కిశోర్, పల్లెర్ల వీరన్న, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 1: భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ జితేందర్‌లతో కలిసి హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, మునిసిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మునిసిపల్, విద్యుత్, వైద్య ఆరోగ్య, రెవెన్యూ శాఖల యంత్రాంగం మరింత చురుకుగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను తక్షణమే సహాయక శిబిరాలకు తరలించాలన్నారు. రిజర్వాయర్ల గేట్లు ఎత్తుతున్న క్రమంలో ప్రాజెక్టుల దిగువ స్థాయిలోని ప్రజలను వెంటనే అప్రమత్తం చేస్తూ ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుత సమయంలో ఎవరు కూడా సెలవుల్లో వెళ్లకుండా విధులు నిర్వర్తించేలా చూడాలన్నారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని కలెక్టర్లను ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని, ఎక్కడా కూడా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం సమర్థవంతంగా పని చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సత్యశారద, సీపీ అంబర్ కిశోర్ ఝా, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సత్యశారద, సీపీ అంబర్ కిశోర్‌ఝా

వెలమలు అన్ని రంగాల్లో మరింతగా రాణించాలి

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

ఘనంగా వెలమ సంక్షేమ సంఘం వార్షికోత్సవం

హనుమకొండ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వెలమలు సంఘటితంగా అన్ని రంగాల్లో మరింత రాణించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. ఆదివారం వరంగల్ పెద్దమ్మగడ్డలోని ఏఆర్ఆర్ గార్డెన్‌లో వెలమ సంక్షేమ సంఘం 29వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. సంఘం అధ్యక్షుడు పేరాల మధుసూదన్ రావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. టెస్కాబ్ చైర్మెన్ మార్నేని రవీందర్ రావు విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. వెలమలు రాజకీయ, సామాజిక, ఆర్థిక తదితర రంగాల్లో రాణించాలన్నారు. వెలమ సంక్షేమ సంఘం సామాజిక కార్యక్రమాలపై ఎక్కువ దృష్టి పెట్టాలని కోరారు. నిరుపేద వెలమ కుటుంబాలకు అండగా ఉండాలని, పేద విద్యార్థులకు ఆర్థికంగా చేయూత నివ్వాలని కోరారు. వెలమల సంక్షేమానికి తన వంతు సహాయ సహకారాలను అందిస్తానని హామీ ఇచ్చారు.

కాగా, వెలమ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కాకులమర్రి మప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షుడు సంఘం వార్షిక నివేదికను ప్రవేశపెట్టారు. సంఘం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. సంఘం భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలను వెల్లడించారు. సంఘం ఉపాధ్యక్షుడు సోమేశ్వర్‌రావు, సంయుక్త కార్యదర్శి రవీందర్ రావు, సభ్యులు గండ్ర ప్రవీణ్, విద్యాసాగర్ రావు, అశోక్ రావు, బాలకిషన్ రావు, వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు. 68 మంది పేద వెలమ విద్యార్థులకు రూ.6లక్షల మేరకు స్కాలర్‌షిప్పులను ఈ సందర్భంగా పంపిణీ చేశారు. ఈ సమావేశానికి సుమారు 500 మంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL సోమవారం 2 సెప్టెంబరు 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

మాజీ కార్పొరేటర్ దశరథరామారావు మృతి

పర్వతగిరి, సెప్టెంబరు 1 : జీడబ్ల్యూఎంసీ మాజీ కార్పొరేటర్, మండల కేంద్రానికి చెందిన పిన్నింటి దశరథరామారావు అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందాడు. ఆదివారం ఆయన మృతదేహానికి టెస్కాబ్ రాష్ట్ర చైర్మన్ మార్నేని రవీందర్‌రావు నివాళులర్పించారు. ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్, గ్రామస్థులు చింతపట్ల సోమేశ్వర్ రావు, రంగు కుమార్, మహ్మద్ అలీ తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న మార్నేని రవీందర్‌రావు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

• కలెక్టర్ సత్యశారద, సీపీ అంబర్‌కిషోర్ ఝా, ఎమ్మెల్యే మాధవరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్, సీపీ, ఎమ్మెల్యే

నెక్కొండ, సెప్టెంబరు 1 : మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పనులు ఉంటేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని కలెక్టర్ సత్యశారద, సీపీ అంబర్ కిషోర్ ఝా. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని వెంకటాపురంలో వరదలో ప్రయాణికుల బస్సు చిక్కుకోవడంతో ప్రయాణికులను రక్షించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న ప్రాంతాలను గుర్తించి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని, వారి ద్వార ప్రజలకు సహాయక చర్యలు అందిస్తున్నామన్నారు. వరదకారణంగా రహదారులు దెబ్బతినడంతో పలు ప్రాంతాల్లో పోలీసు యంత్రాంగం సహాయంతో రాకపోకలను నిలిపివేయించామన్నారు. చెన్నారావుపేట ఊర చెరువు గండిపడే ప్రమాదం ఉండడంతో మరమ్మతు చేశామన్నారు. వరంగల్‌లోని ఎల్ఎస్ నగర్, బీఆర్ నగర్, నర్సంపేటలోని ఎన్‌టీఆర్ నగర్‌లు జలమయం కావడంతో సహాయక చర్యలు చేపట్టామన్నారు. సహాయం చర్యలు చేపట్టడానికి అదనపు పోలీసు, రెవెన్యూ సిబ్బందిని, రిస్క్యూటీం, పడువలను సిద్ధం చేశామన్నారు. నెక్కొండలో కలెక్టర్, సీపీ, ఎమ్మెల్యే దాదాపు మూడు గంటల సమయం ఉండి వర్షం పరిస్థితిని సమీక్షించి అధికారులను అప్రమత్తం చేశారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

వరంగల్ కలెక్టరేట్ , సెప్టెంబరు 1 : భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ జితేందర్‌లతో కలిసి హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, మునిసిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మునిసిపల్, విద్యుత్, వైద్య ఆరోగ్య, రెవెన్యూ శాఖల యంత్రాంగం మరింత చురుకుగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను తక్షణమే సహాయక శిబిరాలకు తరలించాలన్నారు. రిజర్వాయర్ల గేట్లు ఎత్తుతున్న క్రమంలో ప్రాజెక్టుల దిగువ స్థాయిలోని ప్రజలను వెంటనే అప్రమత్తం చేస్తూ ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుత సమయంలో ఎవరు కూడా సెలవుల్లో వెళ్లకుండా విధులు నిర్వర్తించేలా చూడాలన్నారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని కలెక్టర్లను ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని, ఎక్కడా కూడా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం సమర్ధవంతంగా పని చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సత్యశారద, సీపీ అంబర్ కిశోర్ ఝా, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముంపు గ్రామాలకు అన్యాయం చేస్తే ఉద్యమిస్తాం

• ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేసిన ఏజెన్సీ గ్రామస్థులు

నల్లబెల్లి, సెప్టెంబరు 1 : రంగాయ చెరువు రిజర్వాయర్ రీ డిజైన్‌తో ఏజెన్సీ గ్రామాలను ముంచే కుట్ర చేస్తే బాధిత ముంపు గ్రామాల ప్రజలందరం ప్రభుత్వంపై ఉద్యమిస్తామని ఏజెన్సీ గ్రామాల ప్రజలు తెలిపారు. మండలంలోని కొండాపూర్ ఏజెన్సీ గ్రామంలో ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి దిష్టిబొమ్మను ఆదివారం దహనం చేశారు. మాజీ సర్పంచ్ గూబ తిరుపతమ్మ రాజు మాట్లాడుతూ నీటి పారుదల శాఖ సమీక్ష సమావేశంలో రంగాయ చెరువు రిజర్వాయర్ సాంక్షన్ చేయాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు వాసం కన్నయ్య, కొండ కుమార్, ఆనందం, రాజబోయిన వెంకన్న, బొమ్మిడి రాజు, మామిండ్ల దుర్గయ్య, ఎండీ యాకుబ్‌పాష, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎడతెరపిలేని వర్షాలు.. నిండుకుండలా చెరువులు



ఇల్లందలో పర్యటిస్తున్న ఎంపీ కావ్య, కలెక్టర్ సత్య శారద



ఎన్టీఆర్‌నగర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దొంతి



మత్తడి పోస్తున్న మాదన్నపేట చెరువు



మత్తడి పోస్తున్న రంగాయ చెరువు

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 1 : మూడు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలతో నర్సంపేట మండలంలోని చెరువులు నిండుకుండలా మారి వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఆదివారం వరకు కురిసిన వర్షంతో మాధన్నపేట చెరువుతో పాటు మగ్దుంపురం ఊరచెరువు, మహేశ్వరం, ముత్తోజిపేట గ్రామాల్లోని చెరువులు మత్తళ్లు పోస్తున్నాయి. మాధన్నపేట వాగు బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తుండడంతో రాకపోకలను అధికారులు నిలిపివేయించారు. గురిజాల శివారులోని లోలెవల్ వంతెనపై వరదనీరు ఉధృతి కొనసాగుతున్నది. దీంతో నర్సంపేట నుంచి గురిజాల, గుంటూరుపల్లి, లింగాపురం తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నర్సంపేట పట్టణంలోని ఎన్టీయార్‌నగర్ తదితర లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రెవెన్యూ, మునిసిపల్, పోలీస్ అధికారులు మున్సిపాలిటీ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. పట్టణంలోని చర్చకాస్ ఏరియాలలో వావిళ్ల రంజిత ఇల్లు కూలిపోయింది. ముంపు ప్రాంతాలను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి, తహసీల్దార్ రాజేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, సీఐ రమణమూర్తి ఉన్నారు.

• నల్లబెల్లి : రంగాయచెరువు మత్తడి పోసింది. రంగాయ చెరువు మత్తడిపోయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వరద నీరు పెద్ద ఎత్తున చేరడంతో మత్తడి పడిందని పలువురు తెలిపారు.

• దుగ్గొండి : తిమ్మంపేట దామెర చెరువు మత్తడి పోయగా తిమ్మంపేటలోని పంట పొలాలు నీటిలో మునిగిపోయాయి. తిమ్మంపేట, నారాయణతండా రోడ్డు మధ్య గల కాజ్వేపై వరదనీరు ఉధృతంగా ప్రవహించగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లక్ష్మీపురం, దుగ్గొండి మధ్యగల రోడ్డుకు ఉన్న 6 మోరీల వాగు ఉధృతంగా ప్రవహించగా ఎంపీడీవో అరుంధతి, ఎంపీవో శ్రీధర్ సందర్శించి పరిశీలనచేశారు.

• ఖానాపురం : పాకాల సరస్సు రెండు అడుగుల మేర మత్తడిపోయడంతో అశోక్‌నగర్ శివారులోని లో లెవల్ కల్వర్ట్ బ్రిడ్జిపై నుంచి పాకాల వాగు ప్రవహించడంతో కొత్తగూడకు రాకపోకలు నిలిచిపోవడంతో ఎవరు అటు వైపు వెళ్లకుండా ఎస్సై రఘుపతి ఆధ్వర్యంలో పహారా కాసి వాహనాల దారి మళ్లించారు. పాకాలలో చెక్‌పోస్టు వద్ద గేట్‌ను మూసివేశారు. ఖానాపురం నుంచి పెద్దమ్మగడ్డ మీదుగా వెళ్లే ఆయకట్టు రోడ్డుపై అశోక్‌నగర్ నర్సరీ వద్ద పోలీస్ లు బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యాటకులు పాకాలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. వరద నీరు పొంగిపొర్లడంతో సంగెం, పాకాల వాగు, తుంగబంధం కాలువల సమీపం లోని పంట పొలాలు నీటమునగడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. పాకాల సరస్సు మత్తడి, అశోక్‌నగర్ శివారులో లోలెవల్ కాజ్‌వేపై పాకాల వాగు నీరు ఉధృతంగా ప్రవహించడం తో ఆదివారం ఐబీ డీఈ రమేష్, ఏఈ రమేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మనోహర్‌స్వామి, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో భారతి, ఎస్సై రఘుపతి సందర్శించి భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

• సంగెం : గవిచర్లలో బయగోని యాదగిరి ఇంట్లోకి వరద నీరు చేరింది. సంగెం ఎంపీడీవో కాసర్ల రవీందర్ యాదగిరి కుటుంబాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించారు. పల్లార్‌గూడ- మచ్చాపూర్ గ్రామాల మధ్య ఉన్న లో లేవల్ వంతెనపై వరదనీరు అధికంగా వెళ్తుండగా సంగెం తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో రవీందర్‌లు పరిశీలించి రాకపోకలను నిలిపివేశారు. కాట్రపల్లి-వెంకటాపూర్ గ్రామాల మధ్య రాకపోకలను నిలిపివేశారు. సంగెం ఊర చెరువు మత్తడి పడింది. ఎల్గూరుచెరువు మత్తడి పోసేందుకు సిద్ధంగా ఉంది. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు సంగెం తహసీల్దార్ రాజ్‌కుమార్ చెప్పారు.

• గీసుగొండ: మండలంలోని పలు గ్రామాల్లో వాగులు పొంగిపొర్లాయి. పోతరాజుపల్లి-మొగిలిచర్ల, గీసుగొండ- మొగిలిచర్ల, ధర్మారం-పోతరాజుపల్లి గ్రామాల మధ్య వరద కాలువలు పొంగిపొర్లాయి. దీంతో కొంత గంటలు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పాడ్డాయి. రాంపురంలో వరద నీరు పట్టకు ఇండ్లలోకి నీరు వచ్చి చేరింది. కాగా తహసీల్దార్ రియాజుద్దీన్, సీఐ బాబులాల్ రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయించారు.

• పర్వతగిరి : మండల వ్యాప్తంగా ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటుచేసి లోతట్టు ప్రాంతాల్లో అధికారులు పర్యటిస్తున్నారు. జడ్పీ సీఈవో రాంరెడ్డి, తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీవో శంకర్‌నాయక్‌లు మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలుకమ్మ చెరువు వద్ద ఇటీవల నిర్మించిన బ్రిడ్జిపై నుంచి నీళ్లు ప్రవహిస్తున్నాయి. సోమారంలోని డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద ఉన్న కల్వర్టు పైనుంచి నీరు పోతుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వడ్లకొండలో నడి రోడ్డుపై చెట్టుపడిపో వడంతో వాహనాలు నిలిచిపోయాయి. అన్నారం-పెద్దతండా గ్రామాల మధ్య 11కేవీ విద్యు త్ లైన్ పనులను శనివారం రాత్రి ఏడీఈ చంద్రమౌళి, సిబ్బంది వర్షంలోనే చేపట్టారు. హట్యాతండాలో చొక్కోని కుంటకట్ట ప్రమాదకరంగామారడంతో తహసీల్దార్ వెంకటస్వామి తండావాసులతోఇసుకబస్తాలను వేయించారు.

• చెన్నారావుపేట: పాపయ్యపేట ఊర చెరువుకు బుంగ పడడంతో అప్రమత్తమైన అధికారులు తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీవో శ్రీవాణి, ఎస్సై గూడ మహేందర్ సిబ్బంది, రైతులతో కలిసి బంగను పూడ్చారు. మండల కేంద్రంలో అతి పెద్ద చెరువైనా కోపాకుల చెరువు మత్తడి పోస్తోంది. పాతమగ్ధుంపురంలో నర్సంపేట- నెక్కొండ ప్రధాన రహదారిపై ఉన్న లోలెవల్ వంతెనపై వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో నర్సంపేట- చెన్నారావుపేటకు రాకపోకలు నిలిచిపోయాయి. పాతమగ్ధుంపురం గ్రామానికి చెరుకున్న ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి వంతెన పరిస్థితిని పరిశీలించి పూజలు చేశారు. జల్లి, శంకరంతండా, కోనాపురం, ఉప్పరపల్లి, అమీనాబాద్, లింగాపురం, పాపయ్యపేట గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న పత్తి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరి పంటలు పలు చోట్ల వరద నీటిలో మునిగాయి.

• వర్ధన్నపేట: తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లోకి నీటి ఉధృతి పెరుగుతుండడంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ఎదురుగా ఉన్న పైపులైన్‌కు తోడు మరో కాలువను జేసీబీతో తవ్వారు. వర్ధన్నపేట మునిసిపాలిటీ ఆధ్వర్యంలో కాలనీల్లో నీరు నిలిచిన చోట జేసీబీతో తవ్వించి నీటి నిల్వలను బయటకు పంపించారు. వర్ధన్నపేట నుంచి కోనాపురం వెళ్లే కల్వర్టు గతంలోనే గండిపడడంతో తాత్కాలిక మరమ్మతులు చేశారు. ఆకేరువాగుపై ఉన్న చెక్‌డ్యాంకు నేటి వరకు శాశ్వత మరమ్మతులు చేపట్టక పోవడంతో వరద ఉధృతి పలువురి నివేశిత స్థలాల్లోకి చొచ్చుకురావడంతో వారు ఆందోళన చెందుతున్నారు. పట్టణ పరిధిలోని అక్కకుంట, బండచెరువు తదితర కుంటలు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి.

• వర్ధన్నపేట రూరల్ : ఇల్లందలో శివనగర్, వివేకానంద కాలనీ, ఎస్సీ కాలనీతో పాటు పలు వీధుల్లో వర్షపు నీరు భారీ స్థాయిలో వచ్చి చేరింది. లోతట్టు ప్రాంతాలు సైత జలమయం కావడంతో ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కట్ర్యాలలోని ఊరచెరువు మత్తడి పోసింది. కడారిగూడెంలో పైనుంచి వచ్చిన వర్షపు నీరుకు పలు కాలనీలు నీట మునిగాయి. ఉప్పరపెల్లిలోని ఎల్లమ్మ చెరువు మత్తడి దుంకడంతో గ్రామస్థులు సందడిచేశారు. దివిటిపెల్లి, రామారం గ్రామాలకు వెళ్లే రహదారిని అధికారు లు మూసివేశారు. దమ్మన్నపేటలో పెద్ద చెరువు మత్తడి పోయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. కొత్తపెల్లి, ల్యాబర్తి గ్రామాల్లోని ఆకేరు వాగు చెక్ డ్యాంలు మత్తడి పోస్తు అలరించారు.

కొత్తపెల్లిలో పంటపొలాలు నీటమునిగాయి. ఇల్లంద శివారులోని ఆకేరు వాగు చెక్ డ్యాం ఎడమ వైపు కట్ట చాలా రోజుల క్రితం తెగిపోవడంతో ప్రస్తుతం భారీ వరద ఉధృతికి కోతకు గురవుతుంది. రాంధాన్‌తండా, రామోజీ కుమ్మరిగూడెం తండాల్లో సైతం కుంటలు నిండిపోయి ఇండ్ల స్థలాల వద్దకు నీరు చేసి నీట మునిగాయి. ఇల్లందలో నీట మునిగిన పలు కాలనీలను వరంగల్ ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ సత్యశారద పరిశీలించారు. ముంపునకు గల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీ పాఠశాలలోని విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీరి వెంట వర్ధన్నపేట తహసీల్దార్ విజయ్ సాగర్, ఎంపీడీవో వెంకటరమణ ఉన్నారు.

• రాయపర్తి : మండలంలోని రాగన్నగూడెం సమీపంలో ఉన్న వనం వారిమాటు మత్తడిపోసి కనువిందు చేసింది. కాట్రపెల్లిలో కురుస్తున్న వర్షాలతో గుర్రపు సమ్మయ్య ఇల్లు కూలడంతో ఇద్దరికి గాయాలు కాగా, వారిని ఆస్పత్రికి తరలిస్తున్న సమయంలో గ్రామ శివారులోని చెరువు మత్తడి పోసి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో గ్రామస్థులు అంబులెన్సు అవతలి వక్క ఉండడంతో స్ట్రెచర్ ద్వారా క్షతగాత్రులను ప్రవహిస్తున్న నీటిని దాటి పంపించారు. ఆకేరువాగు నుంచి వరద ఉధృతి పెరగడంతో కొత్తూరులోని ఫీడర్ ఛానల్ గేట్లను స్థానికులు ఎత్తి దిగువకు పంపించారు. కాట్రపెల్లిలో చెరువు మత్తడిపోయగా, రాయపర్తి పెద్ద చెరువు సైతం మత్తడి పోయడంతో వరద ఉధృతికి మత్తడికి గండిపడడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. రాయపర్తి ఎస్ఐ శ్రవణ్ కుమార్ భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని కోరారు. మండలంలోని మైలారం, కిష్టాపురం, పోతురెడ్డిపల్లి గ్రామాల్లో వర్షాన్ని సైతం లెక్కచేయడకుండా కాంగ్రెస్ పాలకుర్తి నియోజక వర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి పర్యటించారు. జడ్పీ సీఈవో రామిరెడ్డి, ఎంపీవో కిషన్ నాయక్, తహసీల్దా ర్ శ్రీనివాస్, ఆర్ఐ చంద్రమౌళి తదితరులు పర్యటించారు.

• నెక్కొండ : మండలంలో భారీ వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. నెక్కొండతో పాటు పలు గ్రామాల్లో చెరువులు అలుగుపోస్తున్నాయి. నెక్కొండ బీసీ, రాజీవ్ నగర్, రజక కాలనీల్లో ఇండ్లకు నీరు చెరింది. ప్రజలు ఇబ్బంది పడ్డారు. వాగులు పొంగిపొర్లుతుండటంతో నెక్కొండ నుంచి వివిధ గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.



తిమ్మంపేటలో నీట మునిగిన వరి పంట పొలాలు



కాపులకనపర్తిలో నీట మునిగిన పంట పొలాలు



వడ్లకొండలో రోడ్డుపై పడిన చెట్టు



కాట్రపెల్లిలో గాయాలైన వారిని దాటిస్తున్న గ్రామస్థులు



చెన్నారావుపేట-నర్సంపేట లోలెవల్ వంతెనపై ప్రవహిస్తున్న నీరు



పొంగిపొర్లుతున్న ఆకేరువాగు చెక్‌డ్యాం

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం స్వాధీనం

పర్వతగిరి, సెప్టెంబరు 1 : మండలంలోని ముంజాలకుంటతండాలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు తండాలో ఏఎస్సై రవీందర్‌రెడ్డి తనిఖీలు నిర్వహించగా బాదావత్ కౌసల్య అనే మహిళ నిర్వహిస్తున్న కిరాణాదుకాణంలో రూ.7,780 విలువగల మద్యాన్ని స్వాధీనం చేసుకుని మహిళపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. తనిఖీల్లో సిబ్బంది రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండలో నిలిచిన నాందేడ్ ఎక్స్‌ప్రెస్

నెక్కొండ, సెప్టెంబరు 1: భారీ వర్షాల కారణంగా వరంగల్ జిల్లా నెక్కొండ-కేసముద్రం రైల్వే స్టేషన్‌ల మధ్య వరద తాకిడికి శనివారం రాత్రి రైల్వే ట్రాక్ దెబ్బ తినడం తో రైళ్ల రాకపోకలు నిలిచాయి. నాందేడ్ నుంచి సిమ్లాపూర్ వెళ్తున్న నాందేడ్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఆదివారం ఉదయం రెండు గంటల నుంచి తొమ్మిది గంటల వరకూ నెక్కొండ స్టేషన్‌లో నిలిపారు. రైలులోని ప్రయాణికులు నీరు, అహారంలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానిక చల్లా గోదాముల సముదాయం యజమాన్యం, సిబ్బంది ప్రయాణికులకు వాటర్ బాటిళ్లు, బిస్కెట్ పాకెట్లను అందించారు.

వరద నీటిలో ఎదురు వచ్చిన చేపలు

సంగెం, సెప్టెంబరు 1: మండల కేంద్రంలోని చెరువు మత్తడి పడటంతో గ్రామస్థులు చేపలు పట్టుకున్నారు. ఆదివారం చెరువు మత్తడి పడటంతో వరద నీటిలో కొట్టుక వచ్చిన చేపలను వలలు, చీరలసాయంతో పలువురు గ్రామస్తులు గుంపులుగా వచ్చి చేపలు పట్టుకున్నారు. వరదలు పారే ప్రతి గ్రామంలో అయా గ్రామస్థులు చేపలు పట్టడం కనిపించింది

రావూరు మీదుగా బస్సులు నడిపించాలి

పర్వతగిరి, సెప్టెంబరు 1 : మండలంలోని రావూరు గ్రామం మీదుగా బస్సులను నడిపించాలని ఆదివారం గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. కల్లెడ పాత బ్రిడ్జి వద్ద నుంచి ఆకేరువాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆదివారం గ్రామం మీదుగా బస్సులు వెళ్లాయి. కాగా, తాము ఎన్ని సార్లు అధికారులకు చెప్పినా వినలేదని, ప్రస్తుతం వర్షాలకు ప్రతీరోజూ వెళ్లే రోడ్డు ఇబ్బందిగా ఉండడంతో తమ గ్రామం గుర్తుకు వచ్చిందా..? అని డ్రైవర్‌ను నిలదీశారు. పలు డిపోల ఆర్టీసీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితంలేదని ఆరోపిస్తూ గ్రామానికి వచ్చిన బస్సును ఆపి వర్షంలోనే ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ఆర్టీసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. గ్రామం మీదుగా బస్సులు నడిచేలా చర్యలు చేపడతామని ఆర్టీసీ అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

మరమ్మతులకు నోచుకోని కట్టుకాలువ

వర్ధన్నపేట, సెప్టెంబరు 1: పట్టణ పరిధిలోని కోనారెడ్డి చెరువుకు నీటిని తీసుకువచ్చే కట్టుకాలువ మరమ్మతులకు నోచుకోక పోవడంతో చెరువులోకి నీరువచ్చే మార్గంలేకనే పూర్తిస్థాయిలో నిండడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోనారెడ్డి చెరువుకు వచ్చే కట్టుకాలువ జఫర్‌గడ్ మండలం కోనాయిచలం వద్ద ఆకేరు వాగుపై అక్విడేట్‌ను నిర్మించి గేట్లు బిగించి కట్టుకాలువను వెడల్పు చేసి 12 కిలో మీటర్ల పొడవును కాలువ నుంచి నీరు వచ్చే విధంగా టీడీపీ ప్రభుత్వ హయాంలో చేశారు. నాటి నుంచి ప్రతీ ఏటా కాలువలో పూడిక మట్టి, చెత్తను తొలగించకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. కోనాయిచలం రైతులు సైతం ఆ కాలువకు గండిపడి తమ పంట పొలాలు మునుగుతున్నాయని, గేట్లు దించడం, కాలువల్లో మట్టి, రాళ్లు అడ్డుగా వేసి నీటి ప్రవాహాన్ని రాకుండా అక్కడి రైతులు అడ్డుకుంటున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సైతం తమకెందుకు తగాదా అని మిన్నకుండి పోతున్నారు. దీనికితోడు ఈ కాలువ పలుచోట్ల తెగిపోయిన చోట శాశ్వత మరమ్మతులు చేయక పోవడంతో ఆ నీరంతా వృథాగా వెళ్లి ఆకేరువాగులో కలుస్తుంది. శనివారం రాత్రి కురిసిన వర్షానికి బండౌతాపురం తదితర గ్రామాల్లో కట్టుకాలువకు గండిపడడంతో కట్టుకాలువ ద్వారా ఆశించిన స్థాయిలో నీరురావడంలేదు. ప్రస్తుతం కోనారెడ్డి చెరువుకు జఫర్‌గడ్, దమ్మన్నపేట, దివిటిపల్లి తదితర గ్రామాల చెరువులునిండి మత్తళ్లపోస్తే ఆ నీరంతా కోనారెడ్డి చెరువులోకి వస్తుంది.



కట్టుకాలువకు పడిన గండి

విద్యుదాఘాతంతో వ్యాపారి మృతి

గీసుగొండ, సెప్టెంబరు 1 : మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన బత్తుల అజయ్(40) అనే బట్టల చిరు వ్యాపారి ప్రమాతవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై ఆదివారం మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం దుగ్గొండి మండలం రేపల్లె గ్రామానికి చెందిన అజయ్ ఏడేళ్ల క్రితం జీవనోపాధి కోసం కుటుంబంతో ధర్మారంకు వచ్చి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. బట్టల చిరు వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం వీచిన గాలుల వల్ల ఇంటి ఆవరణలోని టేకు చెట్టు కొమ్మ విరిగి రేకుపై పడింది. ఆ రేకు సర్వీస్ వైర్‌పై పడటటంతో లూజ్‌గా మారింది. లూజ్‌గా మారిన వైర్‌ను సరిచేసేందుకు ఇంటిపైకి ఎక్కి సరి చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై మృతిచెందాడు. మృతుడి తండ్రి బసవయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాబులాల్ తెలిపారు.

వెలమలు అన్ని రంగాల్లో రాణించాలి

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

హనుమకొండ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వెలమలు సంఘటితంగా అన్ని రంగాల్లో మరింత రాణించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. ఆదివారం వరంగల్ పెద్దమ్మగడ్డలోని ఏఆర్ఆర్ గార్డెన్‌లో వెలమ సంక్షేమ సంఘం 29వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. సంఘం అధ్యక్షుడు పేరాల మధుసూదన్ రావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. టెస్కాబ్ చైర్మెన్ మార్నేని రవీందర్‌రావు విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. వెలమలు రాజకీయ, సామాజిక, ఆర్థిక తదితర రంగాల్లో రాణించాలన్నారు. వెలమ సంక్షేమ సంఘం సామాజిక కార్యక్రమాలపై ఎక్కువ దృష్టి పెట్టాలని కోరారు. నిరుపేద వెలమ కుటుంబాలకు అండగా ఉండాలని, పేద విద్యార్థులకు ఆర్థికంగా చేయూత నివ్వాలని కోరారు. వెలమల సంక్షేమానికి తన వంతు సహాయ సహకారాలను అందిస్తానని హామీ ఇచ్చారు. కాగా, వెలమ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కాకులమర్రి మప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షుడు సంఘం వార్షిక నివేదికను ప్రవేశపెట్టారు. సంఘం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. సంఘం భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలను వెల్లడించారు. సంఘం ఉపాధ్యక్షుడు సోమేశ్వర్‌రావు, సంయుక్త కార్యదర్శి రవీందర్ రావు, సభ్యులు గండ్ర ప్రవీణ్, విద్యాసాగర్ రావు, అశోక్ రావు, బాలకిషన్ రావు, వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు. 68 మంది పేద వెలమ విద్యార్థులకు రూ.5లక్షల మేరకు స్కాలర్‌షిప్పులను ఈ సందర్భంగా పంపిణీ చేశారు. సమావేశానికి సుమారు 500 మంది పాల్గొన్నారు.